# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :37 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 05-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఎపి సచివాలయం రెండో బ్లాక్‌లో అగ్నిప్రమాదం

అమరావతి,ఏప్రిల్4: ఏపీ సచివాలయం రెండవ బ్లాక్ లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రెండో బ్లాక్ లో ఉన్న బ్యాటరీలు ఉంచే ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక సమాచారం. విషయం తెలిసిన వెంటనే ఫైర్ సేఫ్టీ సిబ్బందికి ఎస్పీఎఫ్ సిబ్బంది సమాచారం ఇచ్చింది. ఫైర్ సేఫ్టీ సిబ్బంది వెంటనే సచివాలయంలోని రెండో బ్లాక్ వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చింది. ప్రమాదవశాత్తు ఈ సంఘటన జరిగిందా? కుట్ర కోణం ఏమైనా ఉందా? అనే కోణంలో విచారణ జరుగుతోంది. సచివాలయంలోని రెండో బ్లాక్ లోనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టూరిజం మంత్రి కందుల దుర్గేష్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణ రామనారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, హోం మంత్రి వంగలపూడి అనితల పేషీలు ఉన్నాయి. తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరగడంతో సిబ్బంది ఎవరు లోపల లేరని సమాచారం.

## మూగ జీవాలు కూడా రేవంత్ రెడ్డిని క్షమించవు.. మండిపడ్డ హరీశ్‌రావు



సిద్దిపేట : సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఫెయిల్ అయ్యారని, ఆయనను మూగజీవాలు కూడా క్షమించవు అని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఏప్రిల్ 27 న వరంగల్‌లో జరిగే పార్టీ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ ముఖ్య నాయకులతో హరీశ్‌రావు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేటకు 25 ఏళ్ల గులాబీ జెండా కీర్తి ఉంది.. పార్టీ పెట్టి లక్ష్యం సాధించి.. ఆ లక్ష్యంతో అద్భుతమైన అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలిపిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ.. బీఆర్ఎస్ జెండా అని హరీశ్‌రావు పేర్కొన్నారు. నాడు 2001లో సిద్దిపేట కొనాయపల్లి వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం.. సిద్దిపేట ప్రజల ఆశీస్సులు తీసుకోని కేసీఆర్ గులాబీ జెండా ఎగరేశారని గుర్తు చేశారు. సిద్దిపేట వాళ్ళు లేని బహిరంగ సభ లేదు.. ఎక్కడ సభ అయినా.. ఎక్కడ ఎన్నికలు అయిన ఆదిలాబాద్ నుండి అలంపూర్ వరకు సిద్దిపేట నాయకులు పని చేశారని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ రెడ్డి పాలన పెయిల్ అయింది.. హైడ్రా పేరుతొ పేద ప్రజల జీవితాలు నాశనం చేసిండు, భూముల అమ్మకాల పేరుతో మూగ జీవాల గోస పోసుకున్నాడు. చివరకు మూగ జీవాలు కూడా రేవంత్ రెడ్డిని క్షమించవు. రుణమాఫీ చేస్తా అని సగం రుణమాఫీ చేసి చేతులు ఎత్తేసిండు. వానకాలం రైతుబంధు ఎగొట్టిన డబ్బులు 13 వేల కోట్లు.. రుణమాఫీ చేసింది 14 వేల కోట్లు అంటే రైతుబంధు ఎగొట్టి రుణ మాఫీ సగం చేసిండు. ఈగ గింతే రుణమాఫీ అని అసెంబ్లీలోనే చెప్పి చేతులు దులుపుకున్నాడు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం వైఫల్యాలు ప్రజా వ్యతిరేకత వరంగల్ సభ వేదికగా ఎండగట్టాలి. సిద్దిపేట నియోజకవర్గం నుండి 20 వేలకు పైన జన సమీకరణ ఉండాలి. పెద్ద ఎత్తున తరలి రావాలి. సిద్దిపేట కీర్తిని మరో సారి చాటి చెప్పాలి. విద్యార్థి యువత ఆధ్వర్యంలో వెయ్యి మందితో పాదయాత్ర, 100 ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహించాలి. 27న పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల సందర్భంగా ప్రతి పల్లెలో, పట్టణంలో గులాబీ జెండా ఎగరేయాలి అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ వివాదానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్లాన్!

హైదరాబాద్,మరికాసేపట్లో సచివాలయంలో మంత్రుల కమిటీ భేటీ కానున్నారు. హెచ్‌సీయూ వివాదానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కమిటీ ఏర్పాటు చేశారు. కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. హెచ్‌సీయూ కార్యవర్గం, స్టూడెంట్ యూనియన్స్, మేదావులు, పర్యావరణ వేత్తలతో సంప్రదింపుల యోచనలో కమిటీ ఉంది. అపోహాలు, అనుమానాలు, ఆందోళనలకు చెక్ పెట్టేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రతిపక్షాల ఎత్తులను చిత్తు చేసేలా సర్కార్ సరికొత్త ఆలోచనలు చేయనుంది. సమస్య సద్దుమణిగాక కంచ గచ్చిబౌలి భూములలో కొత్త ప్రాజెక్టుకు సర్కారు ప్లాన్ చేస్తోంది. కాగా.. ఇదే అంశంపై నేడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీఎస్‌తో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా.. కంచ గచ్చిబౌలి భూ వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ఎగ్జిక్యూటివ్ కమిటీ, విద్యార్థుల ప్రతినిధులు, జాయింట్ యాక్షన్ కమిటీ, సివిల్ సొసైటీ గ్రూపులు సహా భాగస్వాములైన ప్రతి ఒక్కరితో చర్చిస్తుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం రాత్రి ప్రకటించారు. కమిటీలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి



శ్రీనివాసరెడ్డి సభ్యులుగా ఉన్నారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి ప్రభుత్వం అప్పగించగా.. అక్కడ అభివృద్ధి పనులకు టీజీఐఐసీ శ్రీకారం చుట్టిన నేపథ్యంలో విద్యార్థులు ఆందోళనలు ప్రారంభించారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే వివరణ ఇచ్చింది. ''1975లో హెచ్‌సీయూకు కంచ గచ్చిబౌలిలో ప్రభుత్వ భూమిని కేటాయించారు. కానీ భూ యాజమాన్య హక్కులు వర్సిటీకి బదిలీ చేయలేదు. రెవెన్యూ, అటవీ రికార్డుల ప్రకారం.. సర్వే నంబరు 25లోని భూమిని ఏనాడూ అటవీ భూమిగా వర్గీకరించలేదు.

## డేంజర్ గేమ్ మొదలు పెట్టిన కేటీఆర్

హైదరాబాద్,రాజకీయంగా పార్టీల మధ్య వైరుధ్యాలు మామూలే. దీన్ని ఎవరూ కాదనలేరు. అధికారం ఏ పార్టీకి శాశ్వితం కాదు. కాకుంటే.. తాము అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. విపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించటంతోనే అసలు పంచాయితీ. అలా ఉన్నా ఫర్లేదు కానీ.. కొన్ని గీతల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ దాటకూడదు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ముఖ్యనేత కేటీఆర్ మిస్ అయ్యారా? రేవంత్ సర్కారు మీద ఉన్న ఫ్రస్ట్రేషన్.. రాజకీయ మైలేజీ కోసం ఆయన పడుతున్న తపనలో భాగంగా తాజాగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఇమేజ్ ను భారీగా దెబ్బ తీస్తాయన్న మాట బలంగా వినిపిస్తోంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల (చట్టపరంగా యాజమాన్య హక్కులు లేవనుకోండి) భూమిని చదును చేసి.. వాటిని వేలం వేయాలన్న ప్రభుత్వ ఆలోచనను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్న సంగతి పాతదే. అయితే.. తాజాగా ప్రెస్ మీట్ పెట్టిన కేటీఆర్.. ఈ భూమల్ని ఎవరైనా కొంటే డబ్బులు నష్టపోతారని.. తాము అధికారంలోకి వచ్చినంతనే.. ఈ వేలంలో భూములు సొంతం చేసుకున్న వారి నుంచి తిరిగి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తాము ఇప్పుడే చెబుతున్నామని.. ఈ భూముల వేలంలోకి రియల్ ఎస్టేట్ సంస్థలు అడుగుపెట్టొద్దని వార్నింగ్ ఇచ్చిన వైనం హాట్ టాపిక్ గా మారింది. ఈ మాట తాను ఒక్కడినే చెప్పట్లేదని.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగానే మాట్లాడుతున్నట్లుగా కేటీఆర్ స్పష్టం చేశారు. మూడేళ్ల తర్వాత అధికారం తమదేనని.. ఆ భూములన్నీ వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు. 400 ఎకరాల్లో ఎకో పార్కును ఏర్పాటు చేస్తామన్న కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్ రియల్ బ్రోకర్ మాదిరి కాదు మనిషిలా ఆలోచించాలని వ్యాఖ్యానించారు. రాజకీయంగా ఇష్టారాజ్యంగా మాటలు అనుకోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ.. ఈ తరహా బెదిరింపులు మంచిది కాదన్న విషయాన్ని కేటీఆర్ మర్చిపోయినట్లున్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్ని.. తాము అధికారంలోకి వచ్చినంతనే తమ పాలసీని అమలు చేస్తామని చెప్పటం తప్పేం కాదు. కానీ.. ఇందులో వ్యాపారుల్ని చేర్చటవే



అభ్యంతరమంతా. ఒకవేళ.. భూముల అమ్మకం విషయంలో అభ్యంతరాలు ఉంటే కోర్టు ఉన్నాయి. వాటిని ఆశ్రయించి.. న్యాయపోరాటంచేయటం తప్పు కాదు. అందుకు భిన్నంగా మేం చెబుతున్నాం.. మీరు భూములు కొంటే రేపు మేం పవర్లోకి వచ్చిన తర్వాత ఆ భూముల్ని వెనక్కి తీసుకుంటామని చెప్పే కేటీఆర్ మాటలు తెలంగాణ ఇమేజ్ ను దెబ్బ తీస్తాయని చెబుతున్నారు. ఒక గ్లోబల్ సిటీగా ఉన్న హైదరాబాద్ లో ఒక రాజకీయ పార్టీ ప్రభుత్వం నుంచి మరో పార్టీ చేతికి అధికారం బదిలీ అయిన వెంటనే.. గత ప్రభుత్వం చేపట్టిన వేలాన్ని రద్దు చేస్తామన్న మాట.. తెలంగాణ రాష్ట్ర వాణిజ్య ఇమేజ్ ను దెబ్బ తీస్తుందని చెబుతున్నారు. ఈ రోజున కేటీఆర్ చెప్పినట్లే.. రేపొద్దున బీఆర్ఎస్ అధికారంలో ఉన్న నాడు.. మరో విపక్షం ఇదే తరహాలో వార్నింగ్ లు ఇస్తే పరిస్థితేంటి? ఇలా ఏ పార్టీకి ఆ పార్టీ హెచ్చరికలు చేసుకుంటూ పోతే.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే విషయంలో కార్పొరేట్ సంస్థలు పునరాలోచనలో పడవా? అదే జరిగితే.. డ్యామేజ్ తెలంగాణ ఇమేజ్ కే అన్న విషయాన్ని మర్చిపో కూడదు. తనను తాను మేధావిగా.. సున్నిత మనస్కుడిగా అభివర్ణించుకునే కేటీఆర్.. ఇలాంటి తప్పులు ఎందుకు చేస్తున్నట్లు? తెలంగాణ రాజకీయ క్రీడను డేంజర్ గేమ్ గా మార్చటం సరైనదేనా? అన్నది ప్రశ్నగా మారింది.

## వక్ఫ్ బిల్లు ఆమోదంపై ప్రధాని హర్షం



న్యూఢిల్లీ,ఏప్రిల్4: వక్ఫ్ సవరణ బిల్లు-2025 ఎట్టకేలకు పార్లమెంటు ఆమోదం పొందడంతో ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రక ఆవశ్యకత ఉన్న బిల్లు అని తెలిపారు. దేశవ్యాప్తంగా విస్తృత చర్చతో పాటు-అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాల నడుమ ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించాయి. తొలుత బుధవారం సుదీర్ఘ చర్చ అనంతరం లోక్‌సభ ఆమోదించగా, గురువారం కూడా రాజ్యసభలో 12 గంటల పాటు చర్చించిన తరవాత బిల్లు ఆమోదం పొందింది. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ఇదో చరిత్రాత్మక మలుపు అని హర్షం వ్యక్తంచేశారు. కొన్ని దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని పేర్కొన్న ఆయన.. తాజా బిల్లుతో ఇన్నాళ్లూ అట్టడుగున ఉండిపోయిన వర్గాలకు మేలు చేకూరుతుందని వ్యాఖ్యానించారు. వారి గళం వినిపించే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించాయి. ముఖ్యంగా ముస్లిం మహిళలు, పేద ముస్లింల ప్రయోజనాలను దెబ్బతీసింది. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆమోదం లభించడంతో వారి హక్కులకు భద్రత లభించినట్లయ్యింది. ఈ బిల్లుతో ఇప్పుడు సామాజిక న్యాయం జరిగే ఓ ఆధునిక యుగంలోకి మనం ప్రవేశిస్తున్నాం. ప్రతి పౌరుడి గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వడానికి మేం కట్టు-బడి ఉన్నాం. ఇదే మార్గంలో పయనిస్తూ బలమైన, సమ్మిళిత భారత్‌ను కలిసి నిర్మిద్దామని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రస్తుతం బిమ్‌స్టెక్ సదస్సు నిమిత్తం థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. వక్ఫ్ సవరణ బిల్లు, ముసల్మాన్ వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలపడం ఓ చరిత్రాత్మక మలుపు అని పేర్కొన్నారు. సామాజిక,ఆర్థిక న్యాయం, పారదర్శకత, సమ్మిళిత వృద్ధి కోసం మన సమష్టి అన్వేషణలో ఓ కీలక ఘట్టం అని అభివర్ణించారు. ఇలాంటి చట్టాల బలోపేతం కోసం సహకరించిన కమిటీ సభ్యులు, చర్చల్లో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులకు కృతజ్ఞతలుతెలిపారు. ఇందులో సవరణల కోసం పార్లమెంటరీ కమిటీకి తమ విలువైన సూచనలు పంపిన పౌరులకు ప్రత్యేక ధన్యవాదాలని ప్రధాని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. సుదీర్ఘ చర్చ తర్వాత బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లు, 'ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహార) బిల్లు'కు.. గురువారం రాజ్యసభ కూడా ఆమోదముద్ర వేసింది. ఇక, రాష్ట్రపతి సంతకం కోసం ఈ బిల్లులను ప్రభుత్వం పంపించనుంది. అక్కడ ఆమోదం పొందిన తర్వాత చట్టంగా మారనుంది. వక్ఫ్ బిల్లు పేరును...యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లుగా (ఉమీద్-యుఎంఈఈడీ)గా ప్రభుత్వం పేర్కొంది.

## నివురుగప్పిన నిప్పుల పాతనగరం.. భారీగా పోలీసులు మోహరింపు



హైదరాబాద్, ఏప్రిల్ 4 : వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో అమోదించడంతో ముస్లిం వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదించి రాష్ట్రపతి భవన్‌కు చేరిన పక్షంలో ఇక రాజ్యాంగబద్దంగా అమలు కావడమే తరువాయి. ప్రస్తుత లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు మెజారిటీ సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేసి బిల్లు సవరణకు మద్దతు పలికారు. ఈ క్రమంలో ముస్లింలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు స్వాగతిస్తే.. మరికొందరు కేంద్ర ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలో పాత వాటిలో కొన్ని ప్రాంతాల పరిస్థితి నివురుగప్పిన నిప్పుల కొనసాగుతుంది. శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనల నేపథ్యంలో సున్నిత, అతి సున్నిత ప్రాంతాలుగా గుర్తించిన చోట్ల పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించి పరిస్థితిని అంచనా వేశారు. స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది అంతర్గతంగా అందించిన నివేదికల ప్రకారం చార్మినార్, మక్కా మసీదు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనల సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి నైనా ఎదుర్కొనేందుకు, ఆందోళనకారులను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు వాహనాలను, సిబ్బందిని సిద్ధం చేశారు. నగర్ జాయింట్ సీపీ విక్రమ్ సింగ్ మాన్‌తోపాటు దక్షిణ మండల డీసీపీ స్నేహ మెహ్రా, అదనపు డీసీపీ జావీద్‌లు బందోబస్తును పర్యవేక్షించారు.

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంను ఆశ్రయిస్తాం

న్యూఢిల్లీ,ఏప్రిల్4: కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును ముందునుంచీ కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. ఇది రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించింది. ఈ క్రమంలో పార్లమెంటులో బిల్లుకు ఆమోదం లభించిన క్రమంలో తాజాగా దీనిపై కాంగ్రెస్ పార్టీ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ బిల్లును తాము సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. ఇండియా కూటమి అతిత్వరలో వక్ఫ్ సవరణ బిల్లును సుప్రీం కోర్టులో సవాల్ చేయనుంది. భారత రాజ్యాంగంలోని సూత్రాలు, నిబంధనలపై దాడి చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని మేం ప్రతిఘటిస్తూనే ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా సీఏఏ, ఆర్టీఐ, ఎన్నికల నియమాలపై గతంలో అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేసిన విషయాన్ని రమేశ్ గుర్తుచేశారు. ప్రస్తుతం అవి విచారణలో ఉన్నాయని తెలిపారు. ఈ బిల్లును అటు సోనియా, రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది మైనార్టీలకు ముఖ్యంగా ముస్లింలకు వ్యతిరేకమైనది వాదించారు. వక్ఫ్ సవరణ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. విపక్షాల ఆరోపణలు, అధికారపక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా సాగింది. అనంతరం ఓటింగ్ పక్రియ నిర్వహించగా బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు



వీగిపోయాయి. గురువారం ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టగా.. అర్ధరాత్రి దాటే వరకూ దీనిపై విస్తృత చర్చ జరిగింది. అనంతరం జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. ఇక, రాష్ట్రపతి సంతకం కోసం ఈ బిల్లులను ప్రభుత్వం పంపించనుంది. అక్కడ ఆమోదం పొందిన తర్వాత చట్టంగా మారనుంది.

## బంగ్లాదేశ్ నేత యూనుస్‌తో ప్రధాని మోదీ భేటీ

బ్యాంగ్‌కాక్: థాయిల్యాండ్‌లోని బ్యాంగ్‌కాక్‌లో జరుగుతున్న బిమ్స్‌టెక్ శిఖరాగ్ర సమావేశాల్లో ప్రధాని మోదీపాల్గొన్నారు. అక్కడ ఇవాళ ఆయన బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ మొహమ్మద్ యూనుస్‌ను కలిశారు. ఆ ఇద్దరూ కరాచలనం చేసుకున్నారు. పలు అంశాలపై మాట్లాడారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తొలగించిన తర్వాత .. యూనుస్‌తో మోదీ భేటీ అయ్యారు. బంగ్లాలో భారతీయ మైనార్టీలపై దాడులు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాముఖ్యత సంతరించుకున్నది. మరో వైపు ఇటీవల చైనా పర్యటనలో బంగ్లా నేత ఈశాన్య రాష్ట్రాలపై వివాదాస్పద కామెంట్ చేసిన విషయం తెలిసిందే. బిమ్స్‌టెక్ సభ్య దేశాలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. భారత్‌లోని యూపీఐ పేమెంట్ విధానాన్ని.. సభ్య దేశాలతో పంచుకోనున్నట్లు చెప్పారు.



దీని ద్వారా వాణిజ్యం, వ్యాపారం, టూరిజం మెరగవనున్నట్లు వెల్లడించారు.

## కేరళ సీఎం విజయన్‌కు షాక్.. కుమార్తెను విచారించేందుకు కేంద్రం అనుమతి



కేరళ : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు షాక్ తగిలింది. అవినీతి కేసులో కుమార్తె టి.వీణను విచారించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్‌లో అవకతవకలు జరగడంలో వీణ పాత్ర ఉన్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. కంపెనీల చట్టం ఉల్లంఘన కింద ఆమెపై అభియోగాలు నమోదయ్యాయి. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ ప్రత్యేక న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ సమర్పించిన నేపథ్యంలో వీణను విచారించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఒకవేళ దోషిగా తేలితే పదేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కంపెనీ నుంచి వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి అక్రమంగా నగదు బదిలీ అయినట్లుగా తేలింది. ఈ నేపథ్యంలో సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ ఆధారంగా కేసు విచారణకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. 2017-2020 మధ్య కాలంలో సీఎంఆర్ఎల్ కంపెనీ నుంచి వీణా విజయన్‌కు చెందిన కంపెనీకి రూ. 1.72 కోట్లు బదిలీ అయినట్లు తేలింది. దీంతో ఈ కేసులో విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐఓ ఆదేశాలు జారీ చేసింది.

## సంపాదకీయం

శనివారం 05-04-2025

# హద్దుల్లో ఉంటూ.. పాలన సాగించాలి!

ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి పోయింది. ఎవరు అధికారంలో ఉన్నా తమకు అనుకూలమైన పనులు నెరవేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. అన్నీ రాజకీయాల చుట్టే తిరుగుతున్నాయి. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు రిజర్వ్ చేసింది. ఏం తీర్పు రాబోతోందో అన్నది సర్వత్రా ఉత్కంఠగా ఉంది. గతంలో ఉన్నట్లుగానే చట్టాలు ఉన్నాయని, కొత్తగా ఉప ఎన్నికలు రావడానికి అవకాశం లేదని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వ్యాఖ్యలు చేశారు. దీనిపైనా సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సిఎంకు నియంత్రణ లేదా అని ప్రశ్నించింది. అంటే నేతలు ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదు. ఇకపోతే బిసి రిజర్వేషన్లపై ఢిల్లీ వేదికగా మొత్తం ప్రభుత్వమే తరలి వెళ్లి ధర్నా చేసింది. సిఎం రేవంత్ సహా మంత్రులు, కాంగ్రెస్ పరివారం వెళ్లింది. నిజానికి ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరగాల్సిన వ్యవహారం. రాజ్యాంగ విలువలు, నిబంధనలతో కూడుకున్న విషయం. దీనిపై తేల్చండి అంటూ..ఢిల్లీకి వెళ్లారు. ధర్మయుద్ధం అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన,ఇస్తున్న హామీలకు కేంద్రాన్ని బాధ్యులుగా చేసి విమర్శలు చేయడం సరికాదు. ఇకపోతే హైదరాబాద్‌కు ధీటుగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రకటించారు. అక్కడ పరిశ్రమలు, ఐటి సంస్థలను అభివృద్ది చేస్తామని తెలిపారు. మరి కొత్తగా ఇప్పుడు వివాదంలోకి వచ్చిన 400 ఎకరాల్లో ఐటి పార్కులు అభివృద్ది చేస్తామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఓ వైపు ఆందోళనలు జరుగు తున్నా, సుప్రీం విచారణ చేస్తున్నా ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. నిజానికి ఈ 400 ఎకరాలను అడ్డంగా అమ్మి డబ్బులు చేసుకోవాలన్న ఆత్రుత పాలకుల్లో ఉంది. ఇకపోతే బిఆర్ఎస్ నేతలు గత పాపాలను వదిలి కొత్తగా కాంగ్రెస్ మాత్రమే పాపాలు చేస్తున్నదన్న రీతిలో తెగ రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. దీంతో తమ పాపాల తాలూకు వాసనలు రాకుండా చూసుకోవాలన్న పనిలో పడ్డారు. అందుకే విషయ బిఆర్ఎస్ తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది. తామంతా సుద్దపూసలం అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు పాడిందే పాటగా పాడుతున్నారు. ఓ వైపు దర్యాప్తు సంస్థలు ఒక్కో అవినీతి పుట్టను తవ్వి పెడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్టుల కుంభకోణాలు,అవినీతి, ధరణి ఇలా ఒక్కటేమిటి అనేక రకాలుగా అవినీతి చెదలు గుర్తించారు. వారి పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని విమర్శలు వచ్చాయి. గతంలో కరెంట్, మంచినీళ్లు, సాగునీటి ఆందోళనలు పత్రికల్లో రాకుండా, సోషల్ మీడియాలో రాకుండా మేనేజ్ చేసిన ఘనులు వీరు. ఏదైనా వార్త వస్తే విలేకర్లపై కేసులు పెట్టారు. ఈ క్రమంలో గతంలో, ఇప్పుడు అందరినీ కలుపుకుని అవినీతికి పాల్పడ్డ చెదపురుగులను ఏరిపారేయాల్సిందే. అలాగే రాజకీయంగా వారిని ఎండగట్టాల్సిందే. ప్రజలు నేరుగా బాధితులు కనుక ..ఈ విషయంలో ప్రజలే తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సమతుల్యతను పాటిస్తూ.. ముందుకు సాగాలి. ప్రజాప్రభుత్వమన్న పేరు వచ్చేందుకు కృషి అసలుసిసలు కృషి చేయాలి. ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా ముందుకు సాగాలి. కఠినంగా వ్యవహరించడం కూడా అలవర్చుకోవాలి. నిర్ణయాలు తీసుకోవడంలో నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్నికల హామీలను అమలు చేసేలా వ్యూహాలను అమలు చేసుకోవాలి. ఉచిత పథకాలకు పాతరేయాలి. సన్న బియ్యం ఇస్తున్నామని చంకలు గుద్దుకోకుండా..అర్హులకు అదీ ధరలు పెంచి ఇవ్వాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు కూడా నిజాలు గుర్తించి మసలుకోవాలి. ఎందుకంటే కాంగ్రెస్ ఓ జాతీయ పార్టీ. జాతీయ పార్టీల్లో పెత్తనం రకరకాలుగా ఉంటుంది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛగా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉండదు. సీనియర్లు కావచ్చు..జూనియర్లు కావచ్చు...పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరిగేందుకు అవసరమైన మేరకు మాత్రమే నడుచుకుంటే తప్ప మున్ముందు కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించలేదు. బిఆర్ఎస్ పాలనకు.. కాంగ్రెస్ పార్టీ పాలనకు తేడా అన్నది పనుల్లో చూపాలి.ప్రాంతీయ పార్టీ కావడం వల్ల అక్కడ పార్టీ చీఫ్ కేసిఆర్ చెప్పిందే వేదం.. చేసిందే చట్టం. ఆయన ఎవరి మాటా వినాల్సిన పని లేకుండా నిరంకుశంగా పదేళ్లు పాలించారు. పదేళ్లలో ఏం చేశారో ఇప్పుడు చూస్తున్నాం. కరువు వచ్చిందంటే కాంగ్రెస్ తెచ్చిందని బుర్రలేని మాటలు మాట్లాడుతున్నారు. ఇది రైతులు కూడా అర్థం చేసుకోగలరు. సిఎం రేవంత్ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన పనులు లక్ష్యంగా ముందుకు సాగాలి. వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు. మంత్రులు కావచ్చు.. లేదా ఎమ్మెల్యేలు కావచ్చు ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి. బిఆర్ఎస్ అవినీతిని ఎండగట్టడమే పాలన కాదు. పనులు కూడా చేస్తూ పోవాలని గుర్తించాలి. ఎపిలో జరుగుతున్న అభివృద్ది పనుల వేగాన్ని గుర్తించాలి. చంద్రబాబు ప్రజల సంక్షేమం కోరి ముందు కు అడుగేస్తున్నారు. పెండింగ్ పనుల్లో వేగం పెంచారు. ఇచ్చినహామీలను అమలు చేస్తూనే ఇవ్వని అనేకానేక పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే ప్రయత్నాలు చేపట్టారు. సాగు,తాగునీటి రంగాలను చక్కదిద్దే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.వేగంగా సమస్యల పరిష్కారానికి పర్యటనలకు పూనుకుంటు న్నారు. ఈ క్రమంలో వచ్చే వర్షాకాలం నాటికి నీటి నిల్వలు పెంచడం, సాగునీటి రంగాన్ని ఆధునీక రించడం వంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

# అమరావతికి నిధులొచ్చాయ్...



అమరావతి/ గుంటూరు/ తుళ్లూరు,: రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక అడుగు పడింది. ప్రపంచ బ్యాంకు నుంచి తొలి విడత రుణం కింద రూ.3,535 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమయ్యాయి. తాజాగా ప్రపంచ బ్యాంకు నిధులు విడుదల చేయడంతో త్వరలో ఆసియన్ డెవల్‌పమెంట్ బ్యాంకు(ఏడీబీ) నుంచి కూడా మొదటి విడత రుణం విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజధాని కోసం ప్రపంచ బ్యాంకు రూ.6,700 కోట్లు, ఏడీబీ రూ.6,700 కోట్లు కలిపి మొత్తం రూ.13,600 కోట్లు అప్పుగా ఇస్తున్నాయి. మరో రూ.1,400 కోట్లను కేంద్రం ఏపీకి ప్రత్యేక సాయంగా అందిస్తోంది. ఈ నిధులను రాష్ట్ర రుణ పరిమితిలో (ఎఫ్ఆర్‌బీఎం) లెక్కించకూడదని కేంద్రం నిర్ణయించింది. హడ్కో నుంచి రూ.11,000 కోట్ల రుణ సమీకరణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దానికి సంబంధించి అనుమతి లేఖ కూడా రాష్ట్రానికి వచ్చింది. అలాగే, జర్మనీకి చెందిన ఆర్థిక సంస్థ నుంచి మరో రూ.5,000 కోట్ల రుణాలు తీసుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

రాజధానిపై వైసీపీ కుట్రలతో జాప్యం

అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ చెరో రూ.6,700 కోట్ల చొప్పున రుణాన్ని గతేడాది డిసెంబరులో ఆమోదించాయి. దీనిలో భాగంగా ఈ ఏడాది జనవరిలోనే ప్రపంచ బ్యాంకు నుంచి మొదటి విడత అప్పు విడుదల కావాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతం రాజధానిగా పనికిరాదని, అప్పు ఇవ్వొద్దంటూ కొందరు ఆ బ్యాంకుకు లేఖలు రాశారు. ఈ అభ్యంతరాలను పరిశీలించి నిర్ణయం తీసుకునేసరికి 2నెలలు ఆలస్యమైంది. 2018లో కూడా వైసీపీ ఇలాంటి కుట్రలే చేసి అమరావతికి అప్పు రాకుండా అడ్డుపుల్లలు వేసింది. కానీ, ఈసారి వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వాస్తవానికి 2018లోనే రాజధాని నిర్మాణానికి రుణం మంజూరు చేయడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. కానీ ఆ నిధులు రాకుండా నాటి ప్రతిపక్ష నేత జగన్, విజయసాయిరెడ్డి కుట్రలు పన్నారు. అప్పటి ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేస్తూ ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాశారు. అమరావతి వరదలకు మునిగిపోతుందని పదేపదే ఈ-మెయిళ్లు పంపారు.రాజధాని గ్రామాలతో సంబంధంలేని రైతులతోనూ ఫిర్యాదులు చేయించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటూ జగన్ రోతపత్రికలో విషపు కథనాలు వండివార్చారు. ఈ పరిణామాలతో ప్రపంచ బ్యాంకు వెనక్కి తగ్గింది. అనంతరం సీఎం అయిన జగన్... అమరావతి నిర్మాణానికి తమకు రుణం అక్కర్లేదని ప్రపంచ బ్యాంకుకు లేఖ రాశారు. 2014-19లో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్లను క్లోజ్ చేయకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోయారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బ్రిడ్జి, కరకట్ట రోడ్డు వంటి 19 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి విలువ రూ.16,871 కోట్లు. చంద్రబాబు సీఎం అయ్యాక వీటికి అంచనాలు తయారుచేశారు. 31 సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. పనులకు టెండర్లు కూడా ఖరారు చేశారు.

పనుల సందడి

రాజధానిలో పనుల సందడి ప్రారంభమైంది. ఏప్రిల్ మూడో వారంలో ప్రధాని చేతుల మీదగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పెద్దసంఖ్యలో కార్మికులు వస్తున్నారు. రైతుల ప్లాట్లను అభివృద్ధి చేసే పనులు కూడా సమాంతరంగా సాగనుండడంతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలకు చేతినిండా పని ఉంటోంది. నిర్మాణాలకు ముందస్తు ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయా సంస్థలు బిజీగా ఉన్నాయి. గతంలో ఆగిపోయిన ప్రభుత్వ భవనాల వద్ద కార్మికుల కోసం భారీస్థాయిలో రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. క్లాస్-4, న్యాయమూర్తులు, మంత్రుల భవనాల నిర్మాణ కాంట్రాక్టు పొందిన బీఎసఆర్ ఇన్‌ఫ్రా సంస్థ.. దాదాపు 200 మంది కార్మికుల కోసం షెడ్డును సిద్ధం చేసింది. హ్యాపీనెస్ట్ కాంట్రాక్టు పొందిన ఎన్‌సీసీ సంస్థ షెడ్లను నిర్మించింది. జడ్జిల భవన సముదాయం వద్ద కూడా పనులు జరుగుతున్నాయి. ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల భవనాల నిర్మాణ కాంట్రాక్టు పొందిన కేఎంవీ సంస్థ ఆ నిర్మాణాలకు సమీపంలో షెడ్లు నిర్మిస్తోంది. రాజధానిలో ఈ-6 నిర్మాణ కాంట్రాక్టు తాజాగా పొందిన ఆర్వీఆర్ కంపెనీ తుళ్లూరు శివారులో గతంలో వేసిన షెడ్లను సకల సౌకర్యాలతో కార్మికుల కోసం సిద్ధం చేస్తోంది. సీఎం చంద్రబాబు వెలగపూడిలో ఇటీవల కొన్న స్థలానికి సంబంధించి బీఎసఆర్ సంస్థ పనులు ప్రారంభించింది. రాయపూడి కృష్ణానది నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఫిల్టర్ ట్యాంకు పైపులైను పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వీటితో పాటు కంప చెట్ల తొలగింపు, మెరక, చదును చేయడం వంటి పనుల్లో పెద్దసంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు.

ఈ నెలలోనే ప్రధాని మోదీ రాక! పర్యటన ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

రాజధాని పనులను పునఃప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని మోదీ ఈ నెలలో అమరావతికి రానున్నారు. మోదీ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై సీఎస్ విజయానంద్ బుధవారం అమరావతి సచివాలయంలో అధికారులతో ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తిస్థాయిలో ఏర్పాట్లపై సమీక్షిస్తామని, ఈలోపు శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటినుంచే దృష్టి పెట్టాలని ఆదేశించారు.

అమరావతిలో సింగపూర్ బృందం

రాజధాని అమరావతిలో సింగపూర్ కన్సార్షియం బృందం బుధవారం పర్యటించింది. స్టార్టప్ ఏరియా నిర్మాణంలో సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరోమారు కోరిన నేపథ్యంలో ఈ బృందం రాజధానిలో పర్యటించింది. కోర్ క్యాపిటల్ పరిధిలోని పలు ప్రభుత్వ భవన సముదాయాలు, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవన సముదాయంతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధుల భవనాలను పరిశీలించింది. గతంలో రాజధాని అమరావతిలో సింగపూర్ స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయడానికి ఉద్దండరాయునిపాలెం-తాళ్లాయపాలెం పరిధిలో 1,900 ఎకరాల భూమి సింగపూర్ కన్సార్షియం తీసుకుంది. ఐదేళ్ల తర్వాత పరిస్థితులపై తాజాగా బృందం ఆరా తీసింది. వరద నియంత్రణకు తీసుకున్న చర్యలు, కరకట్ట రోడ్డు పరిస్థితులను పరిశీలించింది. అనంతరం సీఎస్ విజయానంద్, సీఆర్డీఏ ఉన్నతాధికారులతో ప్రతినిధి బృందం సచివాలయంలో భేటీ అయింది. రాజధాని నిర్మాణానికి సంబంధించి గతంలో మాదిరిగానే ఏపీ ప్రభుత్వానికి పూర్తి సహాయ, సహకారాలు అందించాలని సీఎస్ వారికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్‌శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ... రాజధానిని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అంతకుముందు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రజా రాజధానిని నిర్మించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. సుమారు రూ.లక్ష కోట్ల పనులు పునఃప్రారంభం, శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రధాని మోదీ ఈ నెలలోనే శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. సింగపూర్ ప్రతినిధులు ఫ్రాన్సిస్ చోంగ్, ఆడ్రేటాన్, ఎలీజా ఆంగ్, నాజ్నీ బేగం, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. కాగా, నేడు మంత్రి లోకేశ్‌తో పాటు సీఎం చంద్రబాబుతో సింగపూర్ కన్సార్షియం ప్రతినిధులు భేటీ కానున్నారు.

# కాంగ్రెస్ తీరు మార్చుకోవాలి !



హైదరాబాద్,ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పయనం అగమ్యగోచరంగా ఉంది. ముఖ్యంగా ఎపిలో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారయ్యింది. అక్కడ ఎవరు వచ్చినా ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టం. గత ఎన్నికలకు ముందు షర్మిల పగ్గాలు చేపట్టినా పెద్దగా లాభం లేకుండా పోయింది. చివరకు ఆమె కూడా గెలవలేదు. వైఎస్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవడంలో జగన్ సఫలమైనా..పాలనలో విఫలం అయ్యారు. స్వార్థపూరిత రాజకీయాలు జగన్ పతనాన్ని శాసించాయి. ఇప్పుడు షర్మిల పోరాటం వల్ల జగన్‌కు నష్టం జరిగిందే తప్ప కాంగ్రెస్‌కు లబ్ది చేకూరలేదు. తెలంగాణలో బిజెపికి దక్కాల్సిన అధికారం అనూహ్యంగా కాంగ్రెస్‌కు దక్కింది. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక చేస్తున్న కార్యక్రమాలు కొంతమేరే ఫలితం ఇచ్చినా, సమర్థ నేతగా రుజువు చేసుకోలేక పోతున్నారు. బహునాయకత్వం, ప్రతిదానికీ హైకామండ్ ముందు మోకరిల్లాల్సి రావడం వంటి కారణాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో పలచనవుతోంది. మంత్రులతంతా ఎవరికివారు యమునా తీరే అన్నట్లుగా ఉంటున్నారు. తమ శాఖల పరిధిలోని కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయలేక పోతున్నారు. దేవాయదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ రెండు శాఖల్లో ఏం జరుగుతుందో తెలియడం లేదు. అడవుల పెంపకం లేదు. కోతులు గ్రామాలను పట్టిపీడిస్తున్నా పట్టించుకోవడం లేదు. దేవాలయ భూముల చెరను విడిపించలేకపోతున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలకే పరిమితం అయ్యారు. ఎక్కడా రోడ్ల అభివృద్ధి జరగడం లేదు. రాజధాని హైదరాబాద్ అంతర్గత రోడ్లు ఏడాది దాటినా అభివృద్ధిక నోచలేదు. గ్రామాల్లో నిధులు విడుదల కాకపోవడంతో పనులు పడకేశాయి. ఇలా ఒక్కోమంత్రి తీరు ఒక్కోలా ఉంది. శాఖల్లో పనులు సక్రమంగా సాగడం లేదు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోదు.. ప్రతిపక్షంలో ఉంటే విపక్షంగా గట్టి పాత్ర నిర్వహించదు. అధికారం కోసం వెంపర్లాడడం తప్ప అణగిమణిగి ఉండాలన్న ఆకాంక్ష కానరాదు. పార్టీని బలోపేతం చేయడం కోసం ఎవరూ పాటుపడరు. పాటుపడేందుకు ఎవరైనా ముందుకు వస్తే కాళ్లు లాగేస్తుంటారు. అధికారం వస్తే పదవుల కోసం పాకులాడుతారు. అధికారం లేకుంటే కీచులాటతో పార్టీని భ్రష్టు పట్టిస్తుంటారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరికి విశ్వాసం ఉండదు. నాయకత్వాన్ని సహించే లక్షణం లేదు. నాయకుడు ఎవరైనా కాళ్ళల్లో కట్టెలు పెట్టడం అలవాటు. అలా పార్టీకిచేటు జరుగుతున్నా పట్టించుకోరు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇదే ధోరణి కనిపిస్తోంది. బిఆర్ఎస్, బిజెపిలు చేస్తున్న విమర్శలను సమర్థంగా తిప్పికొట్టలేక పోతున్నారు. హైదరాబాద్ భూముల విషయంలో వీరి వాదన పేలవంగా ఉంది. నిజానికి భూమిని కోర్టులో పోరాడి దక్కించుకుంటే దానిని రక్షించాలి తప్ప ఆమ్మరాదు. సన్నబియ్య, పెన్షన్ల పేరుతో దుబారా చేసే బదులు దుబారాకు కళ్లెం వేయాలి.ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే అధికార కూటమిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది నిజంగా ఆత్మహత్య సదృశ్యమే. ఇలా జాతీయ స్థాయిలోనూ కనిపిస్తాయి. అధికారంలో ఉంటే కళ్లు నెత్తికెక్కుతాయి. పార్టీలో ఎవరైనా పెత్తనం చెలాయిస్తారని భావిస్తే అలాంటి వారిని అసలు చేరకుండా అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. పార్టీపరంగా రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉంటారే తప్ప పరిష్కారనికి ముందుకు రారు. జాతీయస్థాయిలో అయినా.. రాష్ట్రస్థాయిలో అయినా ఇదే పరిస్థితి ఉంటుంది. తాజాగా తెలంగాణలో జరుగుతున్న పరిస్థితులు కూడా ఇందుకు భిన్నం కాదు. రేవంత సిఎంగా ముందుకు నడుస్తున్న వేళ..పటిష్ట నిర్ణయాలపై చర్చించడం లేదు. సమస్యలను చర్చించి పరిష్కరించే చర్యలు కానరావడం లేదు. ఉమ్మడిగా పినచేయడం లేదు. కేవలం రేవంత్ మాత్రమే అందరినీ కలుపుకుని పోయేలా ఉంటున్నారు. పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పెద్దగా పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీ పరువు పోయినా, ఉన్న వారు బయటకు పోతున్నా.. ఉన్నవారు మాత్రం బింకాన్ని వదలకుండా తమకోసం పోరాడుతారు. తెలంగాణలోని పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా ఈ జాడ్యం పట్టుకుంది. పార్టీలో వ్యతిరేకంగా పనిచేయడం పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించి..రేవంత్ రెడ్డికి పూర్తి అధికారం ఇచ్చి నడిపించడం లేదు. ఎందుకంటే రాజకీయాలు చేయడం అక్కడే మొదలవుతోంది. అధిష్టానం కర్నాటక, తెలంగాణలను పిండేస్తోందని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ భూముల అమ్మకం వెనకా ఒత్తిళ్లు ఉన్నాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ బలహీన పడితే, ఆ పరిస్థితి ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే లాభిస్తుంది. కొన్ని రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ ఎదురెదురు నిలిచి ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో బీజేపీ బలహీన పడితే కాంగ్రెస్ కొంత లబ్ధి పొందవచ్చు. బీజేపీ ఎంత బలహీనపడినా, కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం అనుమానమే. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బీజేపీకి, కాంగ్రెస్÷-కు సవాలుగా ఉన్నాయి. తమ రాష్ట్రాలలో బీజేపీని, కాంగ్రెస్‌ను ఓడించిన ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికారంలో కొనసాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ గత బిఆర్ఎస్ పాలనకు భిన్నంగా నడుచుకోవాలి.

# పర్యావరణ విధ్వంసం మానాలి

న్యూఢిల్లీ,పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం,ప్యారిస్ ఒప్పందానికి అనుగుణంగా నడచుకోక పోవడం వంటి కారణాలతో దేశంలో ఏటేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్లాస్టిక్ వాడకం కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి. దీంతో కాలువలు, నదులు, సముద్రాలు మురికి కూపాలుగా మారాయి. హిమానీ నదాలు కరగి పోతున్నాయి. దీంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు సాధారణం అయ్యాయి. దేశంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు ఏటేటా నమోదవుతున్నాయి. దేశంలో భానుడు భగ్గు మంటున్నాడు. పచ్చదనానికి ప్రాధాన్యం లేకుండా పోయింది. ఏటా మే వచ్చిందంటే గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతుండటంతో ఇండ్ల నుంచి బయటికొచ్చేందుకు జనం జంకుతున్నారు. వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంటోంది. ఏటేటా భారీ వర్షాలు కురిసినా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలు కాక తప్పలేదు. సముద్రం పాలు కాకుండా నీటిని ఒడిసి పట్టి తరవాతి కాలంలో ఉపయోగించే ప్రణాళికలు ఇంకా రూపుదిద్దు కోవడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తరహా ఆలోచనలు చేయక పోవడంతో ఏటా వరదల్లో ప్రజలు మునిగిపోతున్నారు. నదులు ఉప్పొంగినప్పుడు వేలాదిగ్రామాలు వరదల్లో చిక్కుకుంటున్నాయి. వర్షాలు కురిసిన ప్రతిసారీ కృష్ణా,గోదావరి జలాలు మళ్లీ సముద్రం పాలు కాక తప్పడంలేదు. వరదల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నా పట్టించుకోలేదు. ఉత్తరాదిలో వరదలు ముంచెత్తుతున్నాయి. బీహార్,గుజరాత్,అసోం ,కేరళ తదితర రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలు, పట్టణాలు వరదనీటిలో మునిగిపోతున్నాయి. వరదలు వస్తే తక్షణ చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోతోంది. నగరాలతో పాటు, సమీప ప్రాంతాల్లో ఉన్నచెరువులను కుంటలను ఆక్రమించుకున్న కారణంగా కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ప్రకృతి విధ్వంసం వల్ల వాతావరణ విపరీత ధోరణులు కానవస్తున్నాయి. వరదలు పంటలను, ప్రజలను నష్టాలపాల్జేశాయి. దేశంలో ఒక ప్రాంతంలో కరువు, మరో ప్రాంతంలో సాధారణ స్థాయి కంటే కొన్ని రెట్ల అధిక వర్షాలు పడటం పర్యావరణ సమస్య తీవ్రతకు సంకేతం. దీనిని అధిగమించే ప్రణాళికలు చేయాలి. పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలి.

# వేసవి ఎండల్లో అగ్నిప్రమాదాలు

ఆదిలాబాద్,వేసవి ఎండలు తీవ్రం అవుతున్నందున అగ్నిప్రమాదాలు జరక్కుండా గ్రామాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులను ఆదేశించారు. అలాగే అడవుల్లో మంటలు చెలరేగకుండా అటవీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. రైతులు వరి పొలాల్లో చెత్తను కాలబెట్టే సమయంలో సమీప అటవీ సంపదకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి కాలంలో అటవీ సంపద అగ్నికి ఆహుతి అవుతుందని, దానిని కాపాడేందుకు స్థానిక వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని గ్రామ సంరక్షణ కమిటీలు, వీఆర్వోలు గ్రామంలోని వారందరికీ అటవీసంపద కాపాడుకునే అంశాన్ని వివరించాలన్నారు. ఇకపోతే ఎండాకాలంలో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి రాపిడి కావడంతో నిప్పురవ్వలు ఎగిసి పడి ఎండిన ఆకులపై పడి మంటలు వ్యాపించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇలాంటి ఘటనలపై గతంలోనూ ముందస్తు హెచ్చరికలుచేశారు. గ్రామ పటాలు, రైతుల భూములు తదితర వివరాలు దగ్గర పెట్టుకుని ప్రమాదం జరిగిన వెంటనే వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు తహసీల్దార్లకు తెలియజేయాలని సూచించారు. ఆ తర్వాత మండల నివేదికలను డీఆర్వోకు సమర్పించాలని ఆదేశించారు.

# 2027లో మధ్యంతరం ?

న్యూఢిల్లీ,లోక్ సభ కాల పరిమితి 2029 జూన్ వరకూ ఉంది. ఎందుకంటే 2024 జూన్ 9న నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ముచ్చటగా మూడోసారి ప్రమాణం చేసింది. అలా చూసుకుంటే ఇంకా బిగిసి నాలుగేళ్ళ పైనే ఈ రోజుకు ఉంది.అయితే దేశంలో జమిలి ఎన్నికలు అంటూ చర్చలు సాగుతున్నాయి. ఏపీలో విపక్ష వైసీపీ అయితే మూడేళ్ళలో తాము అధికారంలోకి వస్తామని అంటోంది దాని అర్థం పరమార్థం జమిలి ఎన్నికల మీద ఆశలే అని అంటున్నారు.అయితే జమిలి ఎన్నికలు ఈ దేశంలో జరపడం అంత సులువు కాదు. ఏకంగా ఒకటి రెండూ కాదు అయిదు కీలక అంశాలలో రాజ్యాంగ సవరణలు జరపాలి. అది జరగాలీ అంటే లోక్ సభలో రాజ్యసభలోని మొత్తం సభ్యులలో మూడింట రెండు వంతుల మంది మద్దతుగా నిలవాలి.అది అయ్యే పనేలా అంటే ప్రస్తుతం లోక్ సభలోనే బీజేపీకి సొంతంగా మెజారిటీ లేదు. మిత్రుల మద్దతుతో బొటాబొటీగా సంఖ్యాబలం ఉంది. రాజ్యసభలోనూ సగం కంటే ఒకటి రెండు నంబర్లే ఎక్కువగా ఉన్నాయి. దాంతో పాటు లోక్ సభతో పాటు దేశంలోని 28 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు ఎన్నికలు ఒకేసారి అంటే అది చాలా క్లిష్టమైన వ్యవహారం అని అంటున్నారు.అన్నింటికంటే ముందు ఒక అసెంబ్లీలో మెజారిటీ లేకనో మరో విధంగానో ప్రభుత్వం నిర్ణీత కాల వ్యవధి కంటే ముందే కూలిపోతే ఆ అసెంబ్లీని ఏమి చేస్తారు అన్నది మాత్రం అతి పెద్ద ప్రశ్న. మధ్యలో ఎన్నికలు అంటే జమిలి గొలుసు నుంచి ఆ రాష్ట్రం తప్పించుకున్నట్లే. అలాగే లోక్ సభలో కూడా మెజారిటీలు లేక కూలిన ప్రభుత్వాలు అనేకం ఉన్నాయి. ప్రజా మద్దతుతో ప్రభుత్వాలు ఏర్పాటు కానపుడు ప్రజల అభీష్టం మేరకు కొలువు తీరలేక పడిపోయినపుడు మళ్ళీ ఆ ప్రజల దగ్గరకే వెళ్ళి తీర్పు కోరాలి. ఇది ప్రజాస్వామ్యంలో ప్రాణ సమానమైన సూత్రం. ప్రజాస్వామ్యం అంటే ప్రజలే ప్రభువులు.ఇక్కడ ఎన్ని సార్లు ఎన్నికలు జరిగాయి ఎంత సమయం ఎంత ధనం వృధా అయింది అన్నది ప్రశ్న కాదు. ప్రజల మద్దతు వారు తీర్పు ఒక ప్రభుత్వానికి ఉందా లేదా అన్నదే మౌలిక సూత్రం. అలా చూసుకుంటే జమిలి ఎన్నికలు అన్నవి ఈ దేశంలో జరగడం అసంభవం అని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు దాంతో కేంద్రంలో బీజేపీ కూడా మరో మార్గాన్ని ఆలోచిస్తోంది అని అంటున్నారు.బీజేపీకి మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ముఖ్యం. దానికి ఉత్తరప్రదేశ్ అన్నది అతి ముఖ్యమైన రాజకీయ మెట్టు. అక్కడ మొత్తం 80 ఎంపీ సీట్లు ఉన్నాయి. అయితే బీజేపీకి 2014, 2019లల్లో ఆదరించిన యూపీ 2024లో దెబ్బ కొట్టింది. దాంతో బీజేపీ బలం కాస్తా 34కి దిగిపోయింది. ఇక 2017న భారీ మెజారిటీలో యూపీ అసెంబ్లీలో బీజేపీ గెలిచింది. 2022 నాటికి ఆ బలంలో పావు వంతు పోయింది. 2027లో జరిగే ఎన్నికల్లో మూడవసారి బీజేపీ యూపీలో గెలిచి ప్రభుత్వాన్ని స్థాపిస్తుందా లేదా అన్నది అతి పెద్ద సందేహంగా ఉందిట.పైగా సమాజ్ వాది పార్టీ బాగా పుంజుకుంది. కాంగ్రెస్ కూడా బలపడుతోంది. బీఎస్పీ రూపంలో ఓట్ల చీలిక కూడా లేకుండా పోతోంది. ఆ పార్టీ క్షీణత కాంగ్రెస్ కి లాభిస్తోంది. దాంతో రెండు టెర్ములు అధికారంలో ఉన్న బీజేపీకి యాంటీ ఇంకెంబెన్సీ పెద్ద ఎత్తున ఉండొచ్చు అని ఫలితాలు తారు మారు కావచ్చు అన్నది ఒక చర్చ. అదే కనుక జరిగితే బీజేపీకి 2029 కేంద్రంలో అధికారం అనే ఆశలు అడుగంటుతాయి. అందుకే బీజేపీ యూపీని దృష్టిలో పెట్టుకునే జమిలి జపం చేస్తోంది.యూపీలో 2027 మధ్యలో జరిగే ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా అసెంబ్లీలకు ఎన్నికలు జరిపించడం అసంభవం అని తేలిపోతున్న

## బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

హైదరాబాద్,ప్రధాని మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని, బీజేపీ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఐదు కిలోల బియ్యం మూడు సంవత్సరాల నుంచి ఉచితంగా అందిస్తోందని నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం' అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోలన్ శంకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మైనారిటీ మోర్చానాయకుడు ముహ్మద్ నయీమ్ అన్నారు. మామిడిపల్లి గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పథకంలో కూడ బీజేపీ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుందని, ఇప్పటి వరకు అందించిన ఉచిత బియ్యంలో కేంద్ర ప్రభుత్వం వాటా ఎంత అంటే తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 76 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా 2.80 కోట్ల పేద ప్రజలకు లబ్ధిచేకూరుతుందన్నారు. కేంద్రప్రభుత్వం సుమారు 56 శాతం బరిస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 44 శాతం మాత్రమే భరిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రేషన్ షాపుల్లో ఎక్కడ కూడా మోదీ పేరు కానీ, ఆయన ఫోటో కానీ పెట్టలేదన్నారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకంలో కూడా కేంద్ర ప్రభుత్వం వాటా 41శాతం ఉందని, ఈ పథకం ద్వార రాష్ట్ర ప్రభుత్వానికి భారం అధికంగా పడుతుందన్నారు. దీనికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు చేసే హడావిడి అంతాఇంతా కాదన్నారు. మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చినట్టే ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పెరమోని నరేష్‌యాదవ్, గురిజాని గణేష్‌గౌడ్, గుజ్జుల పద్మారావు, యాతం మహేందర్‌యాదవ్, యాతం శ్రీకాంత్, చిల్లారి శంకర్, కర్ణకోట జగదీష్, ఆదిల అర్జున్, ఆదిల నర్సింహ, ఆదిల బలరాజ్, పాల్గొన్నారు.

## నూతన అధ్యక్షుడు నాగపూర్ వాలా?!

ముంబై:భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నడ్డా పదవీ కాలం ఎప్పుడో ముగిసి పోయింది. లోక్ సభ ఎన్నికలకు ముందే ఆయన సెకండ్ టర్మ్ కూడా పూర్తయింది. అయితే లోక్ సభ ఎన్నికలతో పాటుగా అనేక ఇతర కారణాల వలన, దేశ వ్యాప్తంగా బీజేపీ సంస్థాగత ఎన్నికలు వాయిదా పడడంతో నూతన జాతీయ అధ్యక్షుని ఎన్నిక కూడా లేటవుతూ వస్తోంది. అయితే ఇక వాయిదా ఉండదని ఈ నెలాఖరుకు నూతన అధ్యక్షుని ఎన్నిక క్రతువు పూర్తవుతుందని పార్టీ వర్గాలు విశ్వసనీయంగా చెపుతున్నాయి. ఏప్రిల్ 18,19, 20 తేదీల్లో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశాలలో, లేదా సమావేశాలు ముగిసిన వెంటనే బీజేపీ జాతీయ అధ్యక్షుని ప్రకటన ఉంటుందని అంటున్నారు. అయితే నడ్డా స్థానంలో వచ్చే కొత్త అధ్యక్షుడు ఎవరన్న విషయంలో మాత్రం ఈ రోజు వరకు ఎవరికీ స్పష్టత లేదు. నిజానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాకు సైతం కొత్త అధ్యక్షుడు ఎవరనేది తెలియదని పార్టీ కీలక నేతలే అంటున్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అయితే కొత్త అధ్యక్షుడు ఎవరో దేవుడికి కూడా తెలియదని మీడియా ముఖంగానే చెప్పారు. అది కొంచెం అతిశయోక్తి అయినా నూతన అధ్యక్షుడి ఎన్నిక లేదా ఎంపిక విషయంలో ఏర్పడిన చిక్కుముళ్ళు ఇంకా పూర్తిగా విడి పోలేదనేది మాత్రం నిజం. సో.. కౌన్ బనేగా బీజేపీ అధ్యక్ష్? అనేది ప్రస్తుతానికి సమాధానం లేని, సమాధానం తెలియని ప్రశ్నగానే ఉందని అంటున్నారు. అయితే అధ్యక్ష ఎన్నిక జాప్యానికి కారణాలుగా చెపుతూ వచ్చిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు,పార్లమెంట్ సమావేశాలు, ఇతరత్రా బిజీ ..బిజీ వ్యవహారాలు ముగిసి పోవడంతో ఇక అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ ఊపందుకుంటుందని అంటున్నారు. అవును ఫిబ్రవరిలో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ప్రస్తుతానికిఎలక్షన్ సీజన్ ముగిసింది. ఈ సంవత్సరం చివర్లో (అక్టోబర్, నవంబర్) జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల వరకూ దేశం మొత్తంలో ఎక్కడా ప్రధాన ఎన్నికలు లేవు. అలాగే ప్రస్తుతం జరుగుతున్నపార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం మార్చి4న పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడతాయి. సో పార్టీ అధిష్ఠానం సంస్థాగత వ్యవహారాలపై, ముఖ్యంగా, జాతీయ అధ్యక్షుని ఎన్నికతో పాటుగా తెలంగాణ సహా మరి కొన్నిరాష్ట్రాల రాష్ట్ర అధ్యక్షుల ఎన్నికల పై దృష్టిని కేంద్రీకరిస్తుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.అయితే మరోవంక బీజేపీ జాతీయ అధ్యక్షుని ఎన్నికలో ఇంత జాప్యం జరగడానికి వరస ఎన్నికలు, ఆ వెంటనే వచ్చిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మాత్రమే కారణమా? లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అంటే, ఉన్నాయనే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ముఖ్యంగా 2024 లోక్ సభ ఎన్నికలకు ముందు, బీజేపీ, దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ మధ్య దూరం పెరగడం కూడా అధ్యక్ష ఎన్నిక జాప్యానికి ఒక ప్రధాన కారణంగా పార్టీలో చర్చ జరుగుతోంది. అంతే కాదు బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్య దూరం పెరగడానికి, ఎన్నికలకు ముందు పార్టీ అధ్యక్షు జేపీ నడ్డా, చేసిన వ్యాఖ్యలు పైకి కనిపించే కారణం అయినా, బీజేపీలో పెరుగుతున్న వ్యక్తి ఆరాధన చెక్ పెట్టే ఉద్దేశంతోనే, ఆర్ఎస్ఎస్ పెద్దలు పార్టీ సంస్థాగత ఎన్నికల పగ్గాలను తమ చేతుల్లోకి తీసుకున్నట్లు నాగపూర్ వర్గాల సమాచారం. అయితే, ప్రధాని మోదీ నాగపూర్ పర్యటన సందర్భంగా జరిగిన చర్చల నేపధ్యంలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ తిరిగి వేగం పుంజుకుంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.అందులో భాగంగానే,రానున్నవారం పది రోజుల్లో ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్ సహ మిగిలిన రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుందని అంటున్నారు.ఆ వెంటనే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియను ప్రారంభమవుతుంది. అయితే పార్టీ అధ్యక్షుని ఎన్నికతో పాటుగా పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ఆర్ఎస్ఎస్ ప్రత్యక్ష ప్రమేయం ఉంటుందని అంటున్నారు. ఈ మేరకు, ఇటీవల బెంగళూరులో జరిగిన,ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రతినిధి సభలో నిర్ణయం జరిగినట్లు తెలుస్తోంది. ఒక విధంగా వందేళ్ళ పండగ చేసుకుంటున్న సమయంలో, ఆర్టికల్ 370 రద్దు , రామ జన్మభూమి మొదలు ప్రస్తుత వక్ఫ్ సవరణ చట్టం వరకు ఆరఎస్ఎస్ 'అజెండా' లోని ఒక్కొక అంశం నెరవేరుతున్న నేపధ్యంలో, ఆర్ఎస్ఎస్ –బీజేపీల మధ్య సైద్ధాంతిక బంధం మరింత బలపడేందుకు దోహదం చేసే ... నాగపూర్ వాలనే బీజేపీ నూతన అధ్యక్షుడు అవుతారని అంటున్నారు.

## అన్నకు శుభాకాంక్షలు తెలిపిన తమ్ముడు

అమరావతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వీరిద్దరూ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే, ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నాగబాబుకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన కొణిదెల నాగబాబు.. ఏప్రిల్ 2వ తేదీ నాడు ప్రమాణ స్వీకారం చేశారు. బుధ వారం నాడు మధ్యాహ్నం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబుకు మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్ విధాన పరిషత్ స భ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన తమ్ముడు నాగబాబుకి అన్నయ్య, వదిన ఆశీర్వ అభినందనలు,ఆశీస్సులు తెలియజేస్తున్నామని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# రేవంత్ రెడ్డిపై గళమెత్తుతున్న సినీజనం

హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ భూమిని అమ్మి అభివృద్ధి చేసే ఆలోచనను కొందరు స్వాగతిస్తుంటే, కొందరది పర్యావరణం హితం కాదని హెచ్చరిస్తూ ఆన్లైన్ ఉద్యమాలు చేస్తున్నారు.సినిమా దర్శకుడు నాగ్ అశ్విన్ "మన ఖర్మ" అని పెట్టిన పోస్టునుంచి మొదలైన ఈ ఖండన.. ఇప్పుడు ఉపాసన కొణిదెల, రేణూ దేశాయ్, ప్రకాష్ రాజ్, సమంత, ఈషా రెబ్బ ఇలా అందరూ కొనసాగిస్తున్నారు. వీరిలో ఉపాసన, ప్రకాష్ రాజ్ లాంటి వాళ్లకి ఫాం హౌసులు, తోటలు ఉన్నాయి. వాళ్లు అందులో చెట్లు పెంచడం వంటివి చేస్తుండొచ్చు. కొంతలో కొంత పర్యావరణ ప్రేమికులుగా వాళ్లు గొంతెత్తడం అర్థముంది. కానీ ముఖ్యమంత్రి ఆలోచన తప్పని చెబుతున్న అధికశాతం మంది కనీసం తమ జీవితంలో ఒక్క చెట్టైనా నాటి ఉండరు. అలా ప్రశ్నించే వాళ్లు తమ ఇళ్లల్లో కనీసం కుండీలో మొక్కనైనా పెంచుతూ ఉండకపోవచ్చు. అయినా సరే, బయటికొచ్చి మాట్లాడుతున్నారు.రామోజీ ఫిల్మ్ సిటీ కోసం వేలాది ఎకరాల పచ్చదనాన్ని తినేసినా, రామానాయుడు స్టూడియో, పద్మాలయా స్టూడియో, అన్నపూర్ణ స్టూడియో పేరుతో పదుల ఎకరాలు కాంక్రీట్ మయం చేసినా, అమరావతిలో 50000 ఎకరాల పంటపొలాలని రాజధాని నిర్మాణమంటూ మింగేసినా అదంతా అభివృద్ధిలో భాగమని ఒప్పుకోవాలి. కానీ ఈ 400 ఎకరాలు ముట్టుకుంటే పర్యావరణానికి హాని అని గొంతెత్తాలి. అలా ఉంది కొందరి పరిస్థితి.నిజానికి ఈ 400 ఎకరాల భూమిని చంద్రబాబు హయాములో 2004లో%ా% ఎన్నికల ముందు అన్యాక్రాంతం కావడానికి ప్రయత్నాలు జరిగాయని అప్పట్లో కాంగ్రెస్ విమర్శ చేసింది. చంద్రబాబుకి బినామీ, అత్యంత ఆప్తుడు అయిన బిల్లీరావుతో అప్పటికప్పుడు ఐఎంజీ భారత్ అనే సంస్థను ఏర్పాటు చేయించి ఈ భూమిని ధారాదత్తం చేయడం జరిగింది. తర్వాత కోర్ట్ కేసులు నడిచి, సుప్రీం దాకా వెళ్లి ఆ భూమి ప్రభుత్వానిదే తప్ప మరెవరిదీ కావడానికి వీల్లేదని తీర్పు ఇవ్వడంతో అది అన్యాక్రాంతం కాకుండా ఆగింది.ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమిని అన్యాక్రాంతం చేయకుండా ప్రభుత్వ పక్షాన అమ్మి, రాష్ట్ర ఆదాయానికి అభివృద్ధికి బాటలు వేయాలని చూస్తోంది. ఆదాయం కోసం భూములు అమ్ముకోవడమేంటి అని అడగొచ్చు. నిజానికి ప్రభుత్వభూములు అమ్మకుండా ఏ ప్రభుత్వం పరిపాలించగలిగింది? జనానికి ఎలాగుంటుందంటే..ప్రభుత్వం తమపై ట్యాక్సులు బాదకూడదు, ప్రభుత్వ భూములు అమ్మేయకూడదు, అభివృద్ధి జరిగిపోవాలి..! అలా ఎలా?
అసలు ప్రజల్లో క్రమం తప్పకుండా ఆస్తిపన్ను కట్టేవాళ్లు ఎంతమంది?
దొంగ లెక్కలేయకుండా ఆదాయపు పన్ను కచ్చితంగా కట్టే వ్యాపారులు ఎంతమంది?ఆ నిజాయితీ లేకపోగా ప్రభుత్వ భూములు అమ్మకూడదనడం ఎంత వరకు భావ్యం?ఓపెన్ ల్యాండన్నాక చెట్లు ఉంటాయి. ఇక జంతువులంటారా..అందులో అసలు నిజమెంతో, గ్రాఫిక్స్ ఎన్నో చెప్పక్కర్లేదు.అప్పట్లో ఇడుపులపాయలో రాజశేఖర రెడ్డి భూమి అటవీభూమి అని, అందులో నెమళ్లూ, కుందేళ్లు, జింకలు అన్నీ నిరాశ్రయమైపోయాయని ఈనాడు పత్రిక కథనాలు రాసేది. వాటిని స్వయంగా వై.ఎస్.ఆర్ అసెంబ్లీలో చదివి వినిపించి, సభను నవ్వించి, వివరణ ఇవ్వడం కూడా చూసాం.అలాగే జగ్గి వాసుదేవ్ ఇషా ఫౌండేషన్ భూమి ఎలిఫాంట్ కారిడార్ అని కేసులు వేసారు. కోర్ట్ ఆ కేసుల్ని కొట్టేసింది. అయినా కూడా ఇప్పటికీ జగ్గీ వాసుదేవ్ ని ఏనుగులు సంచరించే భూమిని ఆక్రమించుకున్న వ్యక్తిగా ముద్రవేసి నిత్యం నిందించేవాళ్లున్నారు.మనవాళ్లకి నిజాలక్కర్లేదు..ఎమోషనల్ గా ఎవరో చెబుతున్నదానికి రియాక్టైపోయి ఆందోళన చేసేయడమే.బెంగళూరులో ప్రతి గేటెడ్ కమ్యూనిటీలోనూ చెట్లుంటాయి. పచ్చదనానికి లోటుండదు. కానీ హైదరాబాదులో చాలా గేటెడ్ కమ్యూనిటీల్లో చెట్లు కనపడవు. ముందు ఈ విషయంపై ఫోకస్ పెట్టి, రూల్స్ కఠినతరం చేస్తే ఒక్క 400 ఎకరాలు ఏం ఖర్మ, మొత్తం హైదరాబాదే ఆక్సీజన్ జోన్ అవుతుంది. ఇలాంటివి చేయకుండా ఏదో జరిగిపోతోందని ఏడవడం సెలెక్టివ్ ఏడుపు తప్ప మరొకటి కాదు.హైదరాబాద్ మధ్యలో ఉన్న 400 ఎకరాల చెట్లని కూల్చేయడమెందుకు, అది నగరానికి ఆక్సీజన్ దాయిని కదా..ఊరవతల ఉ




న్న ప్రాంతాల్ని అభివృద్ధికి కేటాయించవచ్చు కదా అని కొందరు ఉచిత సలహాలిస్తున్నారు.

ఇక్కడ రెండు విషయాలు చెప్పుకోవాలి.

అసలు ఈ 400 ఎకరాల్లో మొత్తం చెట్లన్నీ కొట్టేయబడతాయని అనుకోవడం దేనికి? ఏ ప్రాజెక్టైనా అవసరమైన వరకే కాంక్రీట్ చేయడానికి ఉంటుంది. నిర్మాణాల నియమాల ప్రకారం కూడా ఇంత శాతం గ్రీన్ జోన్ ఉండాలని ఉంది. ఒకవేళ లేకపోతే ఆ నియమాలు కఠినంగా ఉండాలని పోరాడొచ్చు. రామోజీ ఫిల్మ్ సిటీలో కూడా అంతే. నిర్మాణాలు ఉన్నాయి, చాలా వరకు గ్రీన్ బెల్ట్ కూడా ఉంది.
%–% ఇక ఎక్కడో ఊరికి వంద కిలోమీటర్ల దూరంలో భూమి అంటే పెట్టుబడిదారుడికి ఆసక్తి ఉండకపోవచ్చు. ఉన్నా ధర ఎక్కువ పలక్క ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత అందకపోవచ్చు.ఇదంతా కాదు. ప్రస్తుతానికి ఈ 400 ఎకరాల అమ్మకం ఆగినా, రేపు ప్రభుత్వం మారాక ఆగుతుందని గ్యారెంటీ లేదు. ఎందుకంటే ముఖ్యమంత్రి సీట్లో కూర్చున్న ఎవరికైనా ఒకే రకమైన ఒత్తిడి ఉంటుంది. పరిపాలన జరగాలంటే పన్నుల వసూళ్లొక్కటీ సరిపోయే రోజులు కావివి. సంక్షేమపథకాలు అమలు చెయ్యాలన్నా, ప్రభుత్వ జీతాలు, పెన్షన్లు ఇవ్వాలన్నా ఖజానాలో డబ్బుండాలి కదా. అందుకే ప్రతి ప్రభుత్వం భూములు అమ్ముతుంది, అమ్ముతూనే ఉంటుంది.
అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆలోచన ఏవిటి?
ఏ రకమైన అభివృద్ధి ఆ 400 ఎకరాల్లో జరగబోతోంది?
ఏ రకంగా అది నగర ప్రజలకి ఉపయోగపడుతుంది?
పర్యావరణాన్ని పాడుచేస్తున్నారన్న విమర్శకి జవాబు ఏవిటి?
ఇవన్నీ ముఖ్యమంత్రి విపులంగా, వివరంగా ప్రెస్ మీట్ పెట్టి, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వాల్సిన అవసరముంది.కొందరు అంటున్నట్టు ఆ 400 ఎకరాలే ఎందుకు ఊరు చివర అయితే ఎందుకు వీలవ్వదు? వంటి ప్రశ్నలకి కూడా వివరణ ఇవ్వాల్సి ఉంది.ముఖ్యమంత్రి ప్రజల్ని కన్విన్స్ చేయడం, ప్రజలతో కమ్యూనికేట్ చేయడం తప్పనిసరి. అప్పటి వరకు ఇలా అందరూ మాట్లాడుతూనే ఉంటారు, వాదనలు వినిపిస్తూనే ఉంటారు.నచ్చినవాడు పచ్చదానాన్ని మింగేస్తే అభివృద్ధి, నచ్చని వాడు మింగితే పర్యావరణవిధ్వంసం..అంటే ఎలా! సినిమా వాళ్లకి రేవంత్ రెడ్డంటే లెక్కలేదు అనే అనుమానాన్ని మరోసారి తెర మీదకు తెచ్చినట్టవుతోంది. ఎందుకంటే కెసీయార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఎన్ని భూముల్ని అమ్మినా సినీజనం సైలెంటుగానే ఉన్నారు!అమరావతిలో చంద్రబాబు 50000 ఎకరాల పంటపొలాల్ని రాజధాని నిర్మాణం పేరుతో విధ్వంసం చేస్తున్నా మౌనం వహిస్తున్నారు సినీజనం. ఇక్కడొక చోద్యం చెప్పుకోవాలి. ఈ 400 ఎకరాలు కొట్టేస్తే మొత్తం హైదరదులో 1-4 డిగ్రీల వరకు వేడి పెరుగుతుందట. అలాంటప్పుడు 50000 ఎకరాలు కొట్టేసిన అమరావతిలో ఎన్ని డిగ్రీలు పెరగాలి? అసలే వేసవిలో మండే కొలిమిలాగ ఉండే అమరావతి ఇంకా ఎంత వేడిగా మారుతుంది? దీని మీద సినీపెద్దలు మాట్లాడరేం?

# నెరవేరబోతున్న దశాబ్దాల కల..అడవుల జిల్లాల్లో ఎయిర్‌పోర్టు



హైదరాబాద్, ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న విమానాశ్రయ కల నెరవేరబోతోంది. అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో త్వరలోనే విమానం ఎగరబోతోంది. ఆదిలాబాద్ పౌరవిమానాశ్రయానికి వాయుసేన గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అటు ప్రజలు ఇటు పార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్‌పోర్టులకు అనుమతులు సాధించడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేయగా, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ నగేష్ కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఓకే చెప్పింది. విమానాశ్రయంతో పాటు వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు లేఖలో తెలిపింది. ఈ శుభవార్తతో ఆదిలాబాద్ ప్రజానీకం మురిసిపోతోంది. పార్టీలకు అతీతంగా ఆదిలాబాద్ విమానశ్రయ ఏర్పాటు అంశంపై హర్షం వ్యక్తమవుతోంది. మామునూరు ఏర్పాటు తరహాలోనే ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ అనుమతుల ఘనత మాదంటే మాదంటున్నాయి అధికార, ప్రతిపక్షాలు. ఏది ఏమైనా దశాబ్దాల కల నెరవేరబోతుండటంతో ఇన్నాళ్లకైనా అడవుల జిల్లాకు మంచి రోజులు రాబోతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తోంది జిల్లా ప్రజానికం. ఆదిలాబాద్ విమానశ్రయ కల ఇప్పటి కాదు.. స్వాతంత్ర్యానికి ముందే ఇక్కడ విమానాలు ఎగిరిన ఘన చరిత్ర జిల్లా సొంతం. నిజాం కాలంలో యుద్ధవిమానాలకు ఊపిరిపోసిన చరిత్ర ఆదిలాబాద్‌కు ఉంది. 1930లోనే యుద్ధభూమికి వెళ్లే యుద్ధ విమానాలకు ఇంధనం నింపడానికి ఏకంగా 369 ఎకరాల భూమిలో ఏరోడ్రోమ్‌ను స్థాపించారు అప్పటి నిజాం రాజులు. 1947లో స్వాతంత్ర్యానంతరం ఈ ఏరోడ్రమ్ భారత వైమానిక దళం నియంత్రణలోకి వెళ్లాయి. 1970 చివరి వరకు పైలట్లకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించే హెలికాప్టర్లకు ఇంధనం నింపే కేంద్రంగా ఉపయోగించారు. 2014లో ఏరోడ్రోమ్‌ను పూర్తి స్థాయి వైమానిక దళ స్టేషన్‌గా మార్చాలని IAF ప్రతిపాదించింది. అదిగో అప్పటినుండి ఇప్పటి దాకా ఆ ఏరోడ్రమ్ లో ఎప్పుడెప్పుడు విమానం ఎగురుతుందా.. మా జిల్లా తలరాత ఎప్పుడు మారుతుందా అని ఎదురు చూడటం తప్ప, కల సాకారమయ్యే ఆశ కనిపించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చింది జిల్లా ప్రజానీకం. ఎట్టకేలకు వాయి సేన గ్రీన్ సిగ్నల్ తో ఆకాశమంతా ఆశలను మోసుకొచ్చినట్టైంది. 2017లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏరోడ్రోమ్‌ను ఆనుకుని ఉన్న కచ్కంటి, ఖానాపూర్, తంతోలి, అనుకుంట గ్రామాల పరిధిలో 1,592 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించడంతో విమానశ్రయ ఆశలకు ఊపిరిపోసినట్టైంది. 2018లో ఇదే హామీని ఎన్నికల్లో తెర మీదకి తెచ్చిన బీజేపీ, ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 2019లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటుకు ఉన్న పరిస్థితులపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ అమిత్ కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నీరజ్ గుప్తాలతో కూడిన బృందం సర్వే చేసి ఓ రిపోర్ట్ ను కేంద్రానికి పంపింది. తాజాగా 2023 లోను బీజేపీ ఎన్నికల హామీలోకి చేరిన విమానశ్రయ ఏర్పాటు తాజాగా ఎయిర్ క్రాఫ్ట్ కు కేంద్రం, వాయిసేన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆదిలాబాద్ జిల్లా వాసుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. విమానాశ్రయం ఏర్పాటుకోసం ఇప్పటికే ఆదిలాబాద్ శివారులో 369 ఎకరాలు విమానాశ్రయ భూములు ఉన్నాయి. వీటితో పాటు ఎయిర్ స్ట్రిప్ నిర్మాణానికి ఆదిలాబాద్ శివారులోని ఖానాపూర్‌లో 481.16 ఎకరాల పట్టా భూములు, 50 ఎకరాల అసైన్డ్ భూములు, అనుకుంటలో 535.38 ఎకరాల పట్టా భూములు, 34.04 ఎకరాల అసైన్డ్ భూములు, తంతోలిలో 261.27 ఎకరాల పట్టా భూములు, 5.02 ఎకరాల అసైన్డ్ భూములు కేటాయించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. మొత్తంగా 1590 ఎకరాల్లో విమానశ్రయాన్ని నిర్మాణం చేయాలని అధికారులు 2019 లోనే కేంద్రానికి రిపోర్ట్ పంపించారు. విద్యుత్, నీరు, రోడ్లు, భవనాల కోసం 40 కోట్ల నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. 2019కి ముందు నుండే ఈ ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి అనుమతులు నిలిపేశారు. ఎయిర్‌ఫోర్స్ విభాగం అధికారులు కూడా ఇప్పటికే 12 సార్లు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో విమానాశ్రయం నెలకొల్పితే ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని.. అంతర్జాతీయ స్థాయిలో ఈ మూడు జిల్లాలకు గుర్తింపు వస్తుందని.. ఉత్తర భారతంతో తెలంగాణకు రాకపోకలు పెరిగి వ్యాపారంతో పాటు ఉన్నతాధికారులు, జాతీయ నాయకుల తాకిడి పెరుగుతుందని అంతా కోరుకుంటున్నారు. ఇటీవల ఎంపీ నగేశ్ ఇటీవల పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి వినతి పత్రం అందించడం.. అటు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని పలు మార్లు ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు అనుమతులు ఇవ్వాలంటూ కోరడం.. శాసన సభలో ఆదిలాబాద్ విమానశ్రయ అంశాన్ని లేవనెత్తడం జరిగాయి. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సైతం ఆదిలాబాద్ అభివృద్ధికి, విమానాశ్రయ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కలిసిరావాలని కోరడం..

## గ్రీన్ సిగ్నల్ !

అదిలాబాద్:ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు, తెలంగాణ ప్రజలందరికీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత పౌర విమానాశ్రయానికి భారత వైమానిక దళం (IAF) ఆమోదం తెలిపిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.ఇంతకముందు మామునూరు విమానాశ్రయానికి అనుమతులు పొందిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ఆదిలాబాద్ విమానాశ్రయానికి భారత వైమానిక దళం నుంచి అనుమతులు పొందడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఆరు నెలల స్వల్ప వ్యవధిలో రెండు విమానాశ్రయాలకు అనుమతులు పొందడం తెలంగాణ ప్రభుత్వ అవిశ్రాంత కృషి ఫలితమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.అదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు (లేఖ సంఖ్య: 5608/ఎయిర్ పోర్ట్స్/2024, తేదీ: 18.12.2024) భారత వాయుసేన (IAF) వాయుసేన అధికారులు.. సముఖతవ్యక్తం చేసింది.దాంతో పాటు.. అక్కడ భవిష్యత్తులో వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు వాయుసేన అధికారులు లేఖలో పేర్కొన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.అంతేకాదు, తెలంగాణ ప్రభుత్వానికి పౌర విమాన సేవలను ప్రారంభించేందుకు కావాల్సిన అనుమతులు మంజూరీ చేస్తున్నట్లు వాయుసేన అధికారులు లేఖ ద్వారా తెలిపినట్టు ఆయన వివరించారు.ఈ విమానాశ్రయాన్ని పౌర విమానయానానికి, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా ఒక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ గా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించినట్టు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.పౌర విమానాల రాకపోకలకు అనువుగా రన్‌వే పునర్నిర్మాణం చేయడం, పౌర టర్మినల్ ఏర్పాటు, ఎయిర్‌క్రాఫ్ట్ ఎప్రాన్ (విమానాలు నిల్పోవడానికి, మలుపులు తిరగడానికి, ఇతర విమానయాన కార్యకలాపాలకు ఉపయోగించే నిర్దిష్ట ప్రాంతం) వంటి ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి పనులు చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.ఇందుకు అవసరమైన భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (%ూా×%)కు సమకూర్చుకోవాలని వాయుసేన అధికారులు లేఖలో సూచించినట్టు మంత్రి తెలియజేశారు.ఎయిర్ పోర్ట్ కు అవసరమైన అన్ని అనుమతులు పొందేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిటెయిల్డ్ ప్రపోజల్స్ ను భారత వాయుసేనకు సమర్పించాలని కోరినందున అందుకు సంబంధించిన తదుపరి కార్యాచరణను అధికారులతో సమీక్షిస్తున్నామని అతిత్వరలోనే అన్ని వివరాలతో కూడిన నివేదికను రూపొందించి కేంద్రానికి, సంబంధిత విభాగాలకు సమర్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.తెలంగాణలో మొన్న మామునూర్, నేడు ఆదిలాబాద్ ఎయిర్ పోర్టులకు అనుమతుల మంజూరీలో సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకి, రాష్ట్రంలో ఏయిర్ పోర్ట్ ల ఏర్పాటుకు అండగా నిలబడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## ఉలుకూ ఎందుకు లేదు?

హైదరాబాద్,రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ రోజుకో మలుపు తిరుగుతున్నది. గత వారం రోజులుగా జరిగిన ప్రచారానికి తగ్గట్టుగా ఉలుకూ పలుకూ లేకపోవడం ఆశావహులను నిరుత్సాహపరుస్తున్నది. త్వరలో తనకు మంత్రివర్గంలో చోటు లభిస్తుందని ఒకరిద్దరు ఆశావహులు సంబురాలు కూడా చేసుకున్నారట! కానీ.. ముహూర్తంగా చెప్పిన తేదీలు ఒక్కోటీ దాటిపోతూ ఉంటే.. ఉసూరుమంటున్నారట! ఊహాగానాలకు తెరదించేలా ఒకటి రెండు రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందా? ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు అనుమతించకపోతే మళ్లీ అటకెక్కుతుందా? అనే ఆందోళనలో ఆశావహులు ఉన్నారు.తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో ముఖ్యమంత్రితో కలుపుకొని మొత్తం 12 మంది ఉండగా, మరో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్‌లో కొలువుతీరింది. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అధిష్ఠానం పెద్దలతో పాటు ముఖ్యమంత్రి చెబుతూ వచ్చారు. అయితే ఎప్పటికప్పుడూ వాయిదా పడుతూ వస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటు అయి పదహారు నెలలు అవుతున్నా విస్తరణకు ముహూర్తం ఖరారు కాలేదు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి, పార్టీ పెద్దలతో భేటీ అయిన సందర్భంలో విస్తరణ ఉంటుందని వార్తలు గుప్పుమన్నాయి. చివరకు పది రోజుల క్రితం మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఒక స్పష్టమైన సంకేతం వచ్చింది. పార్టీ పెద్దలు పీసీసీ అధ్యక్షుడు బీ మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డితో భేటీ అయి చర్చించారు. నలుగురిని మంత్రివర్గంలో తీసుకునేందుకు అనుమతి లభించిందని వార్తలొచ్చాయి. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చెప్పిన పీసీసీ అధ్యక్షుడు.. ఎంతమందిని తీసుకుంటున్నారనేది మాత్రం వివరించలేదు.తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ, ఆ మరుసటి రోజు రంజాన్ పర్వదినం ఉన్నందున విస్తరణ ఏప్రిల్ మొదటి వారంలో ఉంటుందని ప్రచారం జరిగింది. నాలుగో తేదీ లోపు ఎప్పుడైనా జరగొచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్ భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ తో భేటీ సందర్భంగా వార్త గుప్పుమన్నది. పావుగంట పాటు ముఖ్యమంత్రి, గవర్నర్‌తో ఏకాంత చర్చలు జరపడంతో ఇక మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ కార్యకర్తలు సంబురపడ్డారు. ఏమైందో ఏమో కానీ మంగళవారం సీనియర్ నాయకుడు కే జానారెడ్డి రంగారెడ్డి జిల్లాలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ అధిష్ఠానానికి లేఖ రాశారు. రంగారెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఢిల్లీ వెళ్లి పార్టీ పెద్దలను కలిసి త్వరలో జరిగే విస్తరణలో తమ జిల్లాకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. అయితే కోమటిరెడ్డి వెంకట రెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా ఉండేందుకు జానారెడ్డి.. రంగారెడ్డి జిల్లా అంశాన్ని తెరమీదకు తెచ్చారనే వాదన మొదలైంది. నల్లగొండ జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తుండగా, మరొకరికి ఇవ్వడం సరికాదనే చర్చ జరుగుతోంది. అది కూడా ఒకే కుటుంబంలో అన్నదమ్ములకు ఇవ్వడం మూలంగా పార్టీ బదనాం అవుతుందనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జానారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి, రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించాలనే అంశాన్ని తెరమీదకు తెచ్చారంటున్నారు. జానారెడ్డి లేఖతో రాజగోపాల్ కు పదవి దక్కకపోవచ్చని, ఈ నెల 4వ తేదీ లోపు విస్తరణ కష్టమేనని సీనియర్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

### థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన

న్యూఢిల్లీ,ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు– థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు.

# రేవంత్ మంత్రి వర్గ విస్తరణకు మళ్లీ బ్రేకులు?



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి వర్గ విస్తరణ అంశం.. మరోసారి వాయిదా పడినట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఈ నెల 3(గురువారం) మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అందరూ అనుకున్నారు. అంతే కాదు.. గత నెల చివరి వారంలో సీఎం రేవంత్ రెడ్డి.. హుటాహుటిన గవర్నర్‌ను కూడా కలిశారు. అప్పట్లోనే మంత్రి విస్తరణకు సంబంధించిన జాబితాను రేవంత్ గవర్నర్ కు ఇచ్చారన్న ప్రచారం కూడా జరిగింది.అయితే.. గురువారం కూడా.. ఎలాంటి చడీ చప్పుడు లేకపోవడం.. సీఎం సహా అందరూ.. వక్ఫ్ బోర్డు బిల్లు విషయంపై మంతనాలు జరపడం వంటి విషయాల్లో మునిగిపోయారు. మరోవైపు సుప్రీంకోర్టు కూడా.. రేవంత్‌ను హెచ్చరించిన నేపథ్యంలో ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణ అంశంపై మాట్లాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. దీంతో మంత్రి వర్గ విస్తరణకు మళ్లీ బ్రేకులు పడినట్టు తెలుస్తోంది. అయితే.. ఇది అధిష్టానం స్థాయిలో జరగలేదని.. స్థానికంగానే బ్రేకులు పడినట్టు భావిస్తున్నామని కొందరు నాయకులు చెబుతున్నారు.

ఏం జరిగింది?

ఏదో ఒక కారణంతో గడచిన 10 నెలలుగా మంత్రి వర్గ విస్తరణ అంశం వాయిదా పడుతూ వస్తోంది. ప్రస్తుతం జరిగిన వాయిదాకు.. మంత్రుల లిస్టు విషయంలో పార్టీ అగ్రనేత రాహుల్ ఒప్పుకోలేదన్న ప్రచారం జరుగుతుండడం గమనార్హం. రేవంత్ రెడ్డి ఇచ్చిన జాబితాలో కొందరి పేర్ల పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ముఖ్యంగా సీనియర్లను కాదని.. జూనియర్లకు అవకాశం ఇవ్వడాన్ని కూడా.. పార్టీ తప్పుబడుతున్నట్టు తెలిసింది.వాస్తవానికి చాలానే ఖాళీలు ఉన్నప్పటికీ.. కనీసంలో కనీసం.. నలుగురికి తొలుత అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. దీనికిగాను సామాజిక, ప్రాంతీయ సమీకరణాల ఆధారంగా వీరి ఎంపిక చేశారు. కానీ.. సీనియర్లయినా.. కొందరు మాజీ మంత్రులు, అధిష్టానం దగ్గర మంచి పలుకుబడి ఉన్న నాయకులకు మొండి చేయి చూపించారన్నది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో వారే.. ఇప్పుడు మంత్రి వర్గ విస్తరణకు అడ్డు పడుతున్నారని.. అందుకే జాప్యం జరుగుతోందని అంటున్నారు.

# వెట్టి చాకిరిలో ప్రైవేట్ టీచర్లు..సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం



హైదరాబాద్, ప్రైవేట్ రంగంలో విద్యారంగ పటిష్టతకు పాటుపడుతూ సామాజిక సేవ చేస్తున్న ప్రైవేట్ టీచర్లను కార్మికులుగా గుర్తించి వారికి పెన్షన్,పిఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని, వారిని కార్మికులుగా గుర్తించాలని ప్రైవేట్ పాఠశాలల టీచర్లు కోరుతున్నారు. ఇప్పటు ప్రైవేట్ టీచర్లు అనేక వృత్తిగతమైన ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. ఈ క్రమంలో మళ్లీ విద్యావ్యాపారం మొదలయ్యింది. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే పెద్ద బాధ్యతను మోస్తున్న ప్రైవేట్ టీచర్లు అంతకుమించిన సమస్యలనూ భరిస్తున్నారు. పనిగంటలు పెంచి, ఇతర పనులను కూడా విధుల్లో చేర్చి ప్రైవేట్ టీచర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా వేసవిసెలవుల్లోనూ విధులు నిర్వహించాలని యాజమాన్యాలు హుకూం జారీ చేస్తున్న తీరు తమను వెట్టి కార్మికులుగా చేస్తోందని అన్నారు. టీచర్లనే సేల్స్ మ్యాన్‌లను చేస్తూ ఇంటింటికి తిరిగి విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రైవేట్ టీచర్లకు నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన సెలవుల్లోనూ వివక్ష చూపుతున్నాయి వేసవి సెలవులను సైతం యాజమాన్యాలు సరిగా ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి సెలవుల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచే పనిని కూడా టీచర్లకే అప్పజెప్పడం దారుణం అన్నారు. వేసవిలో జీతాలుకూడా ఇవ్వడం లేదన్నారు. ధైర్యంచేసి ఏ టీచరైనా ప్రశ్నిస్తే ప్రైవేట్ అంటే ఇలానే ఉంటుందని, ఉంటే ఉండండి లేకుంటే వెళ్లిపోండని హుకూం జారీ చేస్తున్నాయని అంటున్నారు. ప్రైవేట్ టీచర్లు తెలంగాణ రాష్ట్రంలో 3 లక్షల మందికి పైగా ఉన్నారని దాదాపు తెలంగాణలోని 90 శాతం మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత వీరిపై ఉందన్నారు. ఉద్యోగం ఉండాలంటే ఇవన్నీ చేయాలని యాజమాన్యాలు ఆదేశాలు జారీ చేస్తున్నాయి. దీంతో తప్పని పరిస్థితిలో ప్రైవేట్ టీచర్లు అన్ని పనులు చేయాల్సి వస్తుందన్నారు. ప్రైవేట్ టీచర్ల ఉద్యోగ భద్రత గాలిలో దీపం లాంటిదని, ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఊడిగం చేస్తున్న ఉద్యోగభద్రత లేదన్నారు. దీంతో అభద్రతా భావంతో ప్రైవేట్ టీచర్ కొట్టుమిట్టాడుతున్నాడు. అసలే అర కొర జీతాలు ఇస్తూ, మరోవైపు అన్ని పనులు నెత్తిన వేస్తూ ఎదురు చెప్పితే ఉద్యోగాలు ఉండవని యాజమాన్యాలు బ్లాక్‌మేల్ చేస్తున్నాయని పలువురు ప్రైవేట్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠాలు చెబుతూ, ఇతర రాత పనులు చేస్తూ క్లర్క్‌గా, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు క్యాన్వాసింగ్ కూడా చేస్తూ ప్రచారకర్తలుగా పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పనుల ఒత్తిడిలో అసలు పని బోధన చేయలేక పోతున్నామని ప్రైవేట్ టీచర్లు వాపోతున్నారు. వేలరూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివిధ ఫీజుల పేరుతో యాజమాన్యాలు వసూళ్లు చేస్తూ ఖజానా నింపుకుంటున్నాయి. పాఠశాల ఆస్తులను పెంచుకుం టున్నాయి. కాని అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తమ సమస్యలను గతంలో అనేకసందర్భాల్లో అధికారులకు, మంత్రులకు వివరించినా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా మహిళా టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల సాధారణ సమయాలతో పాటు ప్రత్యేక తరగతుల పేరుతో గంటల కొద్దీ క్లాసులు ఏర్పాటు చేయడంతో మహిళా ఉపాధ్యాయులు శారీరక సమస్యలకు గురవుతున్నారు. పి.ఎఫ్, వైద్య, ఇతర సదుపాయాల నిమిత్తం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తమ సమస్యలపై ఆయన సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చిన అమలు కావడం లేదని అన్నారు.

# మెడికల్ లీవ్‌లో షర్మిల.. ఎందుకు? ఏమిటి?



అమరావతి,వైఎస్ షర్మిలారెడ్డి. APCC చీఫ్. సోషల్ మీడియాలో తెగ యాక్టివ్‌గా ఉండేవారు. దాదాపు ప్రతీరోజూ ట్వీట్లు చేసేవారు. రెగ్యులర్‌గా ప్రెస్‌మీట్లు పెట్టి ప్రత్యర్థి పార్టీలను, నేతలను విమర్శించేవారు. తరుచూ ప్రజల్లోకి వెళ్లి సమస్యలపై పోరాటం చేసేవారు. అలాంటి షర్మిల కొంతకాలంగా కనిపించడం లేదు. ఎక్స్ లో లేరు. మీడియా ముందుకు రాలేదు. జనాలకు ముఖం కూడా చాటేశారు. ఏమయ్యారు? ఏపీ కాంగ్రెస్ అధినేత్రి ఎక్కడకు వెళ్లారు? ఇదే చర్చ నడుస్తోంది. కట్ చేస్తే.. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై స్పందించారు. చాలా కాలం తర్వాత ఆమె నుంచి వచ్చిన రియాక్షన్ ఇది. లేటెస్ట్‌గా విజయవాడ ఇందిరా భవన్‌కు వచ్చారు ఏపీసీసీ చీఫ్ షర్మిల. ఇంకేం.. ఆవిడ వచ్చారంటే.. మాటలు పటాసుల్లా పేలాల్సిందేగా. అదే జరిగింది.. మోదీ, చంద్రబాబు, అవినాష్, ప్రవీణ్ పగడాల వరకూ.. అందరికీ తలా ఓ డోస్ ఇచ్చారు. పనిలో పనిగా మేడమ్ మిస్సింగ్ గురించి కూడా మాట్లాడారు.

మేడమ్ మిస్సింగ్ నిజమేనా?

తాను కనిపించడం లేదనేది అవాస్తవమని.. మెడికల్ లీవ్ అనుకోవచ్చు కదా.. అంటూ మీడియాపై సెటైర్లు వేశారు. తమ పార్టీ నేత శైలజానాథ్ వైసీపీలో చేరడాన్ని తప్పుబట్టారు షర్మిల. ఆ పార్టీలో అధికారం లేదు.. డబ్బు మాత్రమే ఉంది.. అందుకే పోయి ఉండొచ్చని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేతలు తమ పార్టీపై ఫోకస్ చేసి లీడర్లను లాగుతున్నారంటే.. కాంగ్రెస్‌ను చూసి భయపడుతున్నట్టేగా అని కౌంటర్ ఇచ్చారు.

అమరావతికి మోదీ సున్నం కొట్టి పోతారు..

అమరావతి రెండో దశ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ వస్తుండటంపైనా షర్మిల తనదైన స్టైల్‌లో సెటైర్లు వేశారు. ఒకసారి వచ్చి మట్టి కొట్టి పోయారని.. ఈసారి వచ్చి సున్నం కొట్టి పోతారంటూ కామెంట్ చేశారు.

ఇఫ్తార్ విందు ఇచ్చి.. విషం పెట్టినట్లే!!

సీఎం చంద్రబాబుపై సైతం షర్మిల పదునైన విమర్శలే చేశారు. వక్ఫ్ బిల్లుకు చంద్రబాబు మద్దతు ఇవ్వడం అంటే.. ముస్లింలకు వెన్నుపోటు పొడిచినట్లేనని.. ఇఫ్తార్ విందు ఇచ్చి అందులో విషం పెట్టినట్లేనని కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. వక్ఫ్ బిల్లు సవరణలు ముస్లింలకు మేలు చేసేవి కావని.. వాటి ఆస్తులు కాజేసే కుట్ర అని అన్నారు. చంద్రబాబుకు ముస్లింలు ఓట్లు వేయలేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో వక్ఫ్ బిల్లుపై చర్చ జరుగుతుంటే.. ఏపీలో వక్ఫ్ బోర్డు మీద ముఖ్యమంత్రి సమీక్ష పెట్టారని.. దీనిపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై నీచ రాజకీయాలు

ప్రవీణ్ పగడాల విషయంలో వైసీపీ వాళ్లు నీచ రాజకీయం చేస్తున్నారని వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఏపీలో బీజేపీ కుట్ర చేసి.. మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని తప్పుబట్టారు. ఆంధ్రలో ఇంకా అటువంటి కల్చర్ రాలేదని అన్నారు. పోలీసులు వీడియోలు బయట పెడుతున్నారని.. కుటుంబ సభ్యులకు న్యాయం జరుగుతుందని ఆశించారు. ఒకవేళ ప్రవీణ్ పగడాలది హత్య అని ఆధారాలు దొరికితే తాను వారి పక్షాన డీజీపీని కలుస్తానని చెప్పారు షర్మిల.

అవినాష్‌రెడ్డి బెయిల్‌పై బయట ఉంటే ఎట్టా?

ఇక.. వివేకానందరెడ్డి హత్య కేసులో సునీతకూ తనకూ ఎలాంటి విభేదాలు లేవన్నారు. తాను ఎదుర్కొనేది ఎంత పెద్ద వాళ్లనో తెలిసి కూడా సునీతకు సపోర్ట్‌గా నిలుస్తున్నని చెప్పారు. అవినాష్ రెడ్డి సాక్ష్యాలను తారుమారు చేస్తున్నారని.. దర్యాప్తు అధికారిని బెదిరించి తప్పుడు రిపోర్ట్ రాయించారని ఆరోపించారు. బెయిల్‌పై బయట ఉండి తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తే ఇక ఏం న్యాయం జరుగుతుంది? సునీత ప్రాణాలకు రక్షణ ఏదని షర్మిల ప్రశ్నించారు.

# న్యాయమూర్తుల ఆస్తులపై కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, న్యాయమూర్తుల ఆస్తుల వివరాలకు సంబంధించి కీలక నిర్ణయం వెలువడింది. ఫుల్ కోర్టు సమావేశంలో ఆస్తుల వివరాల వెల్లడికి న్యాయమూర్తులు ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు. ప్రతి ఏడాదీ క్రమంగా తమ ఆస్తుల వివరాలను భారత ప్రధాన న్యాయమూర్తికి వెల్లడించడానికి న్యాయమూర్తులు అంగీకరించారు. న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కూడా సీజేఐ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు లభించిన నేపథ్యంలో న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించడంపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఫుల్‌కోర్టు సమావేశంలో తమ ఆస్తులను భారత న్యాయమూర్తికి వెల్లడించేందుకు అంగీకరించారు.గతంలో కూడా సుప్రీం కోర్టు న్యాయమూర్తుల ఆస్తుల వివరాలపై కొంతమేర చర్చ జరిగింది. 2009లో న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను స్వచ్ఛందంగా వెల్లడించాలని కొంతమంది పేర్కొన్నారు. దానిపై ఒత్తిడి పెరిగినప్పటికీ ఆస్తుల ప్రకటన అనేది స్వచ్ఛందంగా ఎవరైనా వెల్లడించవచ్చు కానీ... కచ్చితంగా వెల్లడించాలన్న నియమం లేదు. న్యాయమూర్తుల ఆస్తులకు సంబంధించి అనేక చర్చలు జరిగాయి. ఆ సమయంలో పలువురు న్యాయమూర్తులు స్వచ్ఛందంగా తమ ఆస్తుల వివరాలను వెల్లడించేందుకు ముందుకు వచ్చారు కూడా. కానీ మరికొందరు మాత్రం దాన్ని వ్యక్తిగత స్వేచ్ఛగా భావించారు.అయితే ప్రస్తుతం ఫుల్ కోర్టు సమావేశంలో ఆస్తుల వివరాలను వెల్లడించేందుకు న్యాయమూర్తులంతా ఏకగ్రీవంగా అంగీకరించడం ఇదే తొలిసారి. దీని వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగే అవకాశం ఉంది అనేది జడ్జిలు చెబుతున్నారు. న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన అనేది చారిత్రాత్మకమైన నిర్ణయం. ఇంతకు ముందు కేవలం సీజేఐ మాత్రమే ఆస్తుల వివరాలను వెల్లడించడం జరిగేది.. కానీ వాటిని వెబ్‌సైట్‌లో పెట్టలేదు. కానీ ఇప్పుడు సీజేఐ, ఇతర న్యాయమూర్తులు అందరూ కూడా తమ ఆస్తుల వివరాలను వెల్లడించాలని నిర్ణయించుకున్నారు.

# జగన్ టూర్ రాప్తాడులో అగ్గిని రాజేసింది!



అనంతపురం:ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. గతంలో ఫ్యాక్షన్ కక్షలతో నిత్యం దాడులు, హత్యలతో ఆ నియోజకవర్గ పరిధిల రక్తమోడింది. అయితే గత కొంతకాలంగా అక్కడ అసలు ఫ్యాక్షన్ అనే పదమే వినిపించడం లేదు. నాడు టీడీపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయం జరిగితే.. ఇప్పుడు టీడీపీ, వైసీపీల మధ్య రాజకీయం నడుస్తోంది. నాడు టీడీపీని కాంగ్రెస్ పార్టీ ఓడించిందే లేదు. అయితే ఇప్పుడు అక్కడ వైసీపీ కూడా విజయం సాధించింది. 2019 నుంచి 2024 వరకు రాప్తాడుకు వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 ఎన్నికల్లోనూ రాప్తాడులో పెద్దగా గొడవలు జరిగిన దాఖలానే లేదని చెప్పాలి. ప్రశాంతంగా జరిగిన ఆ ఎన్నికల్లో తిరిగి టీడీపీ విజయ కేతనం ఎగురవేసింది. ఇదంతా గతం అయితే ఇప్పుడు రాప్తాడు పర్యటనకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వస్తున్నారన్న విషయం ఖరారు అయిన మరుక్షణమే రాప్తాడులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఇటీవల జరిగిన రామగిరి మండల పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక సందర్భంగా వైసీపీ, టీడీపీల మధ్య గొడవలు జరిగాయి. ఈ గొడవల్లో మండలంలోని పాపిరెడ్డిపల్లికి చెందిన లింగమయ్య అనే వైసీపీ కార్యకర్త మరణించారు. లింగమయ్య మృతి కుటుంబ తగాదాల వల్ల జరిగిందని టీడీపీ చెబుతుంటే టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత దగ్గరి బంధువులు జరిపిన దాడిలోనే లింగమయ్య చనిపోయారని వైసీపీ వాదిస్తోంది. ఇదే వాదనతో లింగమయ్య కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు కూడా చేశారు. ఇలాంటి సమయంలో తాను రాప్తాడు వస్తున్నానని, మరణించిన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శిస్తానని జగన్ రెండు రోజుల క్రితం ప్రకటించారు. జగన్ నుంచి ప్రకటన వచ్చినంతనే రాప్తాడులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ, టీడీపీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితులకు వైసీపీకి చెందిన తోపుదుర్తి చంద్రశేఖరరెడ్డి నాందీ పలికారన్న వాదనలు వినిపిస్తున్నాయి.జగన్ పర్యటన గురించి ప్రకటించేందుకు బుధవారం మీడియా ముందుకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి జగన్ టూర్ వరకే పరిమితమై ఉంటే సరిపోయేదేమో. అయితే టీడీపీ శ్రేణులను, ప్రత్యేకించి ఎమ్మెల్యేగా ఉన్న మాజీ మంత్రి పరిటాల సునీతను టార్గెట్ చేస్తూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్యాక్షన్ రాజకీయాల్లో ఎప్పుడో మరణించి సునీత భర్త పరిటాల రవీంద్ర పేరును తీసుకువచ్చిన ఆయన%ా% తాను దుర్మార్గుడిని అయితే మరి నీ భర్త ఎలాంటి వారు అంటూ ఆయన ప్రశ్నించారు. హత్యా రాజకీయాలను పరిటాల ఫ్యామిలీ ఇంకా వీడలేదంటూ ఆయన ఆరోపించారు.చంద్రశేఖరరెడ్డి ఆరోపణలతో పరిటాల సునీత అనివార్యంగానే గురువారం మీడియా ముందుకు వచ్చారని చెప్పాలి. పరిటాల రవి హత్య గురించి ఆమె ప్రస్తావించారు. తన భర్త హత్యలో జగన్ కూ పాత్ర ఉందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. టీడీపీ నేతల దాడుల్లో మరణించారంటూ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శిం చేందుకు వచ్చే జగన్ తోపుదుర్తి ఫ్యామిలీ దాడుల్లో చనిపోయిన టీడీపీ నేతల కుటుంబాలను కూడా పరామర్శించాలని ఆమె డిమాండ్ చేశారు. వెరసి రాప్తాడులో ఇప్పుడు జగన్ పర్యటన అగ్గిని రాజేసిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# నాకు మంత్రి పదవి రాలేదో.. దబిడిదిబిడే.. కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్చరిక



హైదరాబాద్,మంత్రి పదవి ఇస్తారా? ఇవ్వరా.. అంటూ ఏకంగా అధిష్టానానికే హెచ్చరికలు జారీ చేశారు ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే. ఇవ్వకుంటే తన దారి తాను చూసుకుంటానంటూ బెదిరింపులకు దిగారు. రాజీనామా చేస్తానంటూ తెగేసి చెప్పారు. దీంతో తెలంగాణ కేబినెట్ విస్తరణ వ్యవహారం రోజురోజుకూ ఊహించని మలుపులు తిరుగుతోంది. సామాజికవర్గాల సమతుల్యత పాటించడం అధిష్టానానికి తలనొప్పిగా మారడంతో విస్తరణ ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే మంత్రి పదవుల కోసం ఆశావహుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. తాజాగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మరోసారి తన డిమాండ్‌ను గట్టిగా వినిపించారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఆయన హెచ్చరించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.మల్ రెడ్డి రంగారెడ్డి గత కొంతకాలంగా మంత్రి పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే రెడ్డి సామాజికవర్గంలో ఎక్కువ మంది ఆశావహులు ఉండటంతో ఆయన పేరు పరిశీలనలోకి రావడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇవ్వకపోతే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, తన స్థానంలో వేరే సామాజికవర్గం నాయకుడిని పోటీ చేయించి గెలిపిస్తానని ఆయన అన్నారు. అంతేకాకుండా, ఆ నాయకుడికైనా రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రి పదవి ఇస్తారా? అని ఆయన ప్రశ్నించారు.రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి ఒక్కరే గెలిచారు. దీంతో జిల్లాకు ప్రాతినిధ్యం వహించే మంత్రి ఎవరూ లేకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే సీనియర్ నేత జానారెడ్డి సైతం రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానానికి లేఖ రాసినట్లు సమాచారం. జానారెడ్డి ఇప్పుడు పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఆయన లేఖ మల్ రెడ్డికి కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది.మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కేబినెట్‌లో మరో ఇద్దరు బీసీలకు అవకాశం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరడం గమనార్హం. ఇప్పటికే ఇద్దరు బీసీ మంత్రులు ఉన్నారని, మరో ఇద్దరికి అవకాశం ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. అయితే రెడ్డి సామాజికవర్గం నుంచి కూడా మంత్రి పదవుల కోసం డిమాండ్లు కొనసాగుతుండటంతో అధిష్టానం ఎవరికి అవకాశం ఇస్తుందో వేచి చూడాలి.మల్ రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, రెడ్డి సామాజికవర్గంలో పోటీ ఎక్కువగా ఉండటం ఆయనకు ప్రతిబంధకంగా మారింది. అయితే జానారెడ్డి వంటి సీనియర్ నేత మద్దతు లభించడం ఆయనకు కొంత బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. మరి మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన హెచ్చరిక అధిష్టానంపై ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి. ఒకవేళ ఆయన తన పదవికి రాజీనామా చేస్తే అది కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికర పరిస్థితిని కలిగిస్తుందనడంలో సందేహం లేదు.

## బిఆర్ఎస్ నేతలపై కేసు నమోదు

హైదరాబాద్,కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదైంది. నకిలీ వీడియోలు ప్రచారం చేస్తున్నారంటూ గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాలకు సంబంధించి వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం భూములను తీసుకోవద్దని, అక్కడున్న చెట్లను తొలగించవద్దని హెచ్‌సీయూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ నిరసనలు కాస్త పెద్దఎత్తున ఘర్షణలకు దారి తీశాయి.నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీ ఛార్జ్ సైతం చేశారు. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చకు దారి తీసింది. మరోవైపు విద్యార్థుల నిరసనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారాయి. అయితే యూనివర్శిటీలో విద్యార్థుల నిరసనలకు సంబంధించి నకిలీ వీడియోలు వ్యాప్తి చేస్తున్నారంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ దిలీప్, క్రిశాంక్‌పై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్దేశపూర్వకంగా కొంతమంది ఎడిట్ చేసిన వీడియోలు వైరల్ చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అందిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టి గులాబీ పార్టీ నేతలపై కేసు బుక్ చేశారు. దిలీప్, క్రిశాంక్ ఇద్దరూ హెచ్‌సీయూ అధికారులను సంప్రదించకుండా వీడియోలు ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేసినట్లు– పోలీసులు విచారణలో గుర్తించారు.

# పెచ్చులూడిన చార్మినార్.. తప్పిన ప్రమాదం



హైదరాబాద్,హైదరాబాద్ లో అకాల వర్షాలు అతలాకుతలం చేశాయి. బలమైన ఈదురు గాలులు వీస్తూ బీభత్సం సృష్టించాయి. కారుమబ్బులు ఆవరించి కుండపోత వర్షం కురిసింది. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి.భారీగా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగరంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నగరంలో వర్షంధాటికి చారిత్రక కట్టడం చార్మినార్ పెచ్చులు ఊడిపడ్డాయి. భాగ్యలక్ష్మి దేవాలయం వైపున ఉన్న మినార్‌లో పై కప్పు నుంచి పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెట్టింటా వైరల్ గా మా రాయి.నగరంలోని పలు ప్రాంతాల్లో వరుణుడు దంచికొట్టాడు. బంజారాహిల్స్.. జూబ్లీహిల్స్..సచివాలయం..ఆబిడ్స్..నాంపల్లి..పటాన్ చెరువు,శేర్లింగంపల్లి ..సికింద్రాబాద్లలో భారీ వర్షం కురిసింది. భారీగా కురిసిన వానతో రోడ్లన్నీ కాలువలను

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com